E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com



ఇక ఉక్కపోత షురూ! » 2లో

హైదరాబాద్ (తేదీ) 31-01-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక: 31|| పేజీలు–6 www.ekaburu.com

## నదీజలాల్లో రాష్ట్ర వాటా పరిరక్షిస్తాం



» భారాస హయాంలోనే జలద్రోహానికి పునాది
» –నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

» 3లో

# రేపే విచారిస్తాం

» ఎర్రవల్లి కుదరదు.. నందినగర్‌లోనే..
» మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభిస్తాం
» కేసీఆర్‌కు మరోసారి సిట్ నోటీసులు
» ఇంటి గోడకు అతికించిన అధికారులు



ఈకబురు,ఫోన్ ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు శుక్రవారం మరోసారి నోటీసులు జారీ చేసింది. శుక్రవారం రాత్రి నందినగర్ నివాసానికి వెళ్లిన అధికారులు..ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గోడకు వాటిని అతికించారు. ఎర్రవల్లి నివాసంలో విచారించాలని కేసీఆర్ కోరగా.. ఆ విజ్ఞప్తిని తిరస్కరించి నందినగర్‌లోనే విచారిస్తామని, ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభిస్తామని నోటీసుల్లో స్పష్టం చేశారు.

సీఆర్పీసీ సెక్షన్ 160 కింద వీటిని జారీ చేశారు. తొలిసారిగా గురువారం ఇచ్చిన నోటీసులకు స్పందించిన కేసీఆర్.. విచారణ వాయిదా వేయాలని కోరిన సంగతి తెలిసిందే. ఈ మేరకు సిట్‌కు లేఖ రాయడం విదితమే. దీనిపై న్యాయ నిపుణులను సంప్రదించిన సిట్ అధికారులు తాజా నోటీసులు ఇచ్చారు. ఓ వ్యక్తి నుంచి ఏదైనా కేసుకు సంబంధించిన సమాచారం కావాలనుకుంటే సెక్షన్ 160 కింద అధికారులు నోటీసులు ఇస్తారు.

**సుదీర్ఘంగా చర్చించి..**

కేసీఆర్ వయస్సు 65 ఏళ్లకు పైబడి ఉండటంతో.. గురువారం ఇచ్చిన నోటీసుల్లో సిట్ అధికారులు ఓ వెసులుబాటు కల్పించారు. తమ కార్యాలయంలో విచారణకు రావాలని భావిస్తే రావచ్చని.. లేదంటే హైదరాబాద్‌లో మీరు చెప్పిన చోటుకే మేము వస్తామని తెలిపారు. అయితే మున్సిపల్ ఎన్నికల బిజీలో ఉన్నానని, విచారణకు మరో తేదీ ఎంచుకోవాలని కేసీఆర్ కోరారు. విచారణ కోసం ఎర్రవల్లికి రావాలని తెలిపారు. ఈ నేపథ్యంలో సిట్ శుక్రవారం న్యాయ నిపుణులతో భేటీ అయింది.

తరువాయి 2లో

## పోలవరం-నల్లమలసాగర్‌ను

# ఎజెండాలో చేర్చొద్దు

» ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనను కేంద్రం పరిశీలిస్తే.. ఎగువన వరద నీటిని మళ్లించే ప్రాజెక్టును చేపడతాం
» జల వివాదాల పరిష్కార కమిటీకి తెలంగాణ స్పష్టీకరణ
» వారంలోపు రెండు రాష్ట్రాలు ఎజెండా పంపాలి: సీడబ్ల్యూసీ ఛైర్మన్



ఈకబురు,హైదరాబాద్: పోలవరంనల్లమలసాగర్ అంశాన్ని ఎజెండాలో చేర్చడానికి వీల్లేదని, ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనను కేంద్రం పరిశీలిస్తే.. ఎగువన వరద నీటిని మళ్లించే ప్రాజెక్టును తాము కూడా చేపడతామని తెలంగాణ స్పష్టం చేసింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాల పరిష్కారానికి కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీ మొదటి సమావేశం శుక్రవారం దిల్లీలో జరిగింది. సీడబ్ల్యూసీ ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అధికారులతోపాటు కమిటీలోని సీడబ్ల్యూసీ, ఎన్‌డబ్ల్యూడీఏ సభ్యులు హాజరయ్యారు. దాదాపు రెండు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం చర్చించిన అంశాలు ఇలా ఉన్నాయి..

పలు అంశాలపై వాదోపవాదాలు

సమావేశం ప్రారంభమైన తర్వాత సీడబ్ల్యూసీ ఛైర్మన్ పలు అంశాలపై ప్రజంటేషన్ ఇచ్చారు. తర్వాత ఆంధ్రప్రదేశ్ పంపిన ఎజెండాలోని అంశాలను వివరించారు. ఇందులో పోలవరంబనకచర్ల గురించి ప్రస్తావించగా...

తరువాయి 2లో

## ఇక సమాచార హక్కునూ చంపుతారా?



––ఆర్థిక సర్వే తీరుపై ఖర్గే ధ్వజం

ఈ కబురు, దిల్లీ ; సమాచార హక్కు చట్టాన్ని (ఆర్టీఐ) పునఃపరిశీలించాలని ఆర్థిక సర్వే పిలుపునిచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వ తీరుపై శుక్రవారం మండిపడ్డారు. ఎంజీనరేగా (మహాత్మాగాంధీ ఉపాధిహామీ చట్టం )ను చంపేశారు, ఇక ఆర్టీఐ వంతా? అని నిలదీశారు.

» 3లో

# పండు వెన్నెల్లో.. నిండు జాతర..

» మేడారంలో తల్లులకు ఎత్తు బంగారం సమర్పణ
» తరలివచ్చిన భక్తులు
» వనదేవతలను దర్శించుకున్న ప్రముఖులు



ఈకబురు,మేడారం: నిండు జాతర కళతో మేడారం వనమంతా పున్నమిని తలపించేలా వెలుగులీనుతోంది. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరిన తర్వాతి రోజును నిండు జాతరగా పిలవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో శుక్రవారం తల్లులను దర్శించుకునేందుకు భక్తులు భారీగా వరుస కట్టారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల మంది ప్రజలు ఆర్టీసీ బస్సులు, సొంత వాహనాల్లో మేడారానికి చేరుకున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల నుంచి ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. భక్తులు ఎత్తు బంగారాన్ని ముట్టజెప్పడంలో పోటీ పడ్డారు. ఒడి బియ్యం, పసుపు, కుంకుమలను తల్లులకు సమర్పించారు.

**జనసంద్రంగా జంపన్నవాగు**

జంపన్నవాగు పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించగా పెద్దలు జల్లు స్నానాలతో తరించారు. జంపన్నవాగుకు ఇరువైపులా ఘాట్లలో ఉన్న కల్యాణకట్టల్లో భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. జంపన్నవాగు నుంచి పవిత్ర గద్దెల ప్రాంగణం వరకు ఇసుకేస్తే రాలనంత జనంతో కిటకిటలాడింది. నిండు జాతర వేళ మేడారానికి ప్రముఖులూ అధిక సంఖ్యలో వరుస కట్టారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతోపాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ఉన్నతాధికారులు తల్లులను దర్శించుకొన్నారు.

తరువాయి 2లో

# బలం మాకే.. కాదు.. బలగం మాదే

» పుర ఎన్నికల్లో బలాబలాలపై ప్రధాన పార్టీల్లో అంచనాలు

ఈకబురు,హైదరాబాద్: తెలంగాణలో నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలకు వచ్చే నెల 11న జరగనున్న ఎన్నికల కోసం నామినేషన్ల దాఖలు శుక్రవారంతో ముగిసింది. ఇక పార్టీలు ఎన్నికల ప్రచారంలో కదం తొక్కనున్నాయి. గత ఎన్నికల్లో కరీంనగర్, నిజామాబాద్, రామగుండం కార్పొరేషన్లు, 127 పురపాలికల్లోని మొత్తం 3112 డివిజన్లు, వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఈసారి నల్గొండ, మంచిర్యాల, కొత్తగూడెం, మహబూబ్‌నగర్‌లు పురపాలికల నుంచి నగర పాలక సంస్థల స్థాయికి ఎదిగాయి. జాబితాలో 27 పురపాలికలను తొలగించగా కొత్తగా 17 పురపాలికలు వచ్చాయి. మొత్తంగా ఏడు కార్పొరేషన్లు, 116 పురపాలికలకు ఎన్నికలు జరగనున్నాయి.

**ఆధిపత్యం మాదే అంటున్న కాంగ్రెస్**

2020లో జరిగిన నగరపాలక, పురపాలక సంఘాల ఎన్నికల్లో తక్కువ స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ ఈసారి మెజారిటీ స్థానాలు గెలుస్తామనే ధీమా వ్యక్తం చేస్తోంది. మొత్తం ఏడు నగర పాలక సంస్థల్లో నల్గొండ, మంచిర్యాల, మహబూబ్‌నగర్, కొత్తగూడెం, రామగుండం నియోజకవర్గ కేంద్రాలు కాగా వాటిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నారు. పురపాలక సంఘాల కేంద్రాల్లోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఎక్కువగా ఉండడం సానుకూలాంశంగా మారింది.

తరువాయి2లో

## షరతులకు అంగీకరించకున్నా దిల్లీకెందుకు వెళ్లారు?



» 3లో

## మహాత్మాగాంధీ ఆలోచనా విధానాన్ని ద్వేషంతో తుడిచిపెట్టలేరు: రాహుల్

3లో



## ఇలా పరీక్ష పూర్తి.. అవిగో మార్కులు!

ఎప్‌సెట్, పీజీఈసెట్‌లో ఈసారి వినూత్న మార్పులు

ఈ-కబురు,హైదరాబాద్: ఎప్‌సెట్, పీజీఈసెట్ అంటే రాష్ట్రంలోని లక్షలమంది విద్యార్థుల జీవితాల్లో కీలకమైన పరీక్షలు. దరఖాస్తు చేసుకుంది మొదలు ఫలితాలు వచ్చేవరకు రోజులు, నెలలు ఉత్కంఠగా ఎదురు చూస్తుంటారు. కానీ ఇకపై ఆ పరిస్థితి ఉండదు. ఈ ఏడాది నుంచి పలు విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టనుండటంతో పరీక్ష పూర్తవగానే విద్యార్థులు అప్పటికప్పుడే ఎన్ని మార్కులు వచ్చాయో తెలుసుకోవచ్చు.

2లో

# హార్వర్డ్ లో సీఎం రేవంత్‌రెడ్డి

## ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ పూర్తి



ఈ-కబురు,హైదరాబాద్: అమెరికాలోని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లో 'ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్'ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిచేశారు. ఈ నెల 25 నుంచి 30 వరకూ కొనసాగిన ఈ ప్రోగ్రామ్‌లో సీఎంతో పాటు మొత్తం 62 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తరువాయి2లో

# మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర!

» నేడు ప్రమాణం చేసే అవకాశం
» పునరేకీకరణ దిశగా ఎన్సీపీ చీలిక వర్గాల కసరత్తు?

ఈ-కబురు అజిత్ పవార్ సతీమణి సునేత్రా పవార్ మహారాష్ట్ర తొలి మహిళా ఉపముఖ్యమంత్రి కానున్నారు. ఆమె శనివారం పదవీ స్వీకార ప్రమాణం చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. "ముంబయిలో రేపు పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశమై సునేత్రను శాసనసభాపక్ష నాయకురాలిగా ఎన్నుకుంటుంది" అని ఎన్సీపీ నాయకుడొకరు తెలిపారు. సాయంత్రానికల్లా ఆమె ఉపముఖ్యమంత్రిగా పదవీ స్వీకార ప్రమాణం చేస్తారని ఆయన



పేర్కొన్నారు.

తరువాయి2లో

# అమెరికా ఆర్థికశాఖపై ట్రంప్ దావా

వెయ్యి కోట్ల డాలర్ల పరిహారం కోరిన అధ్యక్షుడు



ఈ-కబురు,వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశ అంతర్గత రెవెన్యూ సేవలు (ఐఆర్ఎస్), ఆర్థిక (ట్రెజరీ) విభాగాలపై కోర్టులో దావా వేశారు. ట్రంప్‌తో పాటు ఆయన ఇద్దరు కుమారులకు సంబంధించిన వ్యాపార, వ్యక్తిగత పన్ను రిటర్నుల సమాచారం లీక్ కాకుండా నిరోధించడంలో ఈ రెండు విభాగాలూ విఫలమయ్యాయని అందుకు వెయ్యి కోట్ల డాలర్ల నష్ట పరిహారం చెల్లించాలని ఫ్లోరిడా ఫెడరల్ కోర్టులో దాఖలు చేసిన దావాలో పేర్కొన్నారు. ట్రంప్ కుమారులు ఎరిక్ ట్రంప్, డొనాల్డ్ ట్రంప్ జూనియర్‌లు, వారి కుటుంబానికి చెందిన ట్రంప్ సంస్థలే ఈ కేసులో ఫిర్యాదుదారులు.

తరువాయి3లో

# పండు వెన్నెల్లో.. నిండు జాతర..



**నేటితో ముగియనున్న జాతర**

మేడారం మహాజాతర శనివారం సమ్మక్క వన ప్రవేశం ఘట్టంతో ముగియనుంది. సాయంత్రం 4 గంటల తర్వాత ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. బుధవారం సారలమ్మ ఆగమనంతో ప్రారంభమైన జాతరకు గత మూడు రోజుల్లో 80 లక్షల మంది భక్తులు వచ్చి ఉంటారని అంచనా వేస్తున్నారు. చివరి రోజున భక్తుల రాక పెద్దసంఖ్యలో ఉంటుందని చెబుతున్నారు.

**రద్దీ నిర్వహణలో సమన్వయ లోపం**

మేడారం జాతర అంటేనే భక్తులు లక్షల సంఖ్యల్లో తరలివచ్చే వేడుక. వీరంతా గద్దెలపై కొలువైన అమ్మవార్లను దర్శించుకునే సందర్భంలో రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ కీలకం. కానీ, శాఖల మధ్య సమన్వయలోపం భక్తులకు అసౌకర్యం కలిగించింది. గద్దెల వద్దకు వెళ్లే దారి, క్యూలైన్లకు వెళ్లే మార్గాల సమాచారం తెలియక భక్తులు తికమకపడ్డారు. నెత్తిన ఎత్తు బంగారం బరువులను పెట్టుకొని వెనక్కి... ముందుకు... తిరుగుతూ అవస్థలు పడ్డారు. పోలీసులు తమ సిబ్బందిని ఇబ్బందులకు గురిచేయొద్దని, వారిని గద్దెల వద్ద విధులకు వదలండంటూ దేవాదాయశాఖ అధికారి మైకులో పలుమార్లు చెప్పడం గమనార్హం. ఇక ఉన్నతాధికారులు జారీచేసిన వీఐపీ, వీవీఐపీ పాస్‌లను సైతం శుక్రవారం అనుమతించలేదు. ఆయా పాస్‌లకు కేటాయించిన క్యూలైన్లను తొలగించడంతో సంబంధిత కార్డులతో వచ్చిన వారు నిరాశకు గురయ్యారు.

**స్తంభించిన ట్రాఫిక్**

శుక్రవారం పస్రా నుంచి తాడ్వాయి, మేడారం వరకు భారీగా ట్రాఫిక్ స్తంభించింది. వేల సంఖ్యలో వాహనాలు రెండున్నర గంటలపాటు చిక్కుకుపోయాయి. వాహనాల రాకపోకల నియంత్రణకు పోలీసులు పకడ్బందీ ప్రణాళికలు చేసినప్పటికీ... సమస్య తప్పలేదు. రద్దీ అధికంగా ఉన్న సమయంలో ఇలా జరగడం సహజమేనని వారు తెలిపారు.

## రేపే విచారిస్తాం



సుదీర్ఘ మంతనాల తర్వాత కేసీఆర్‌కు మరోసారి నోటీసులు జారీ చేయాలని నిర్ణయించింది. ఎన్నికల అఫిడవిట్లు, రాష్ట్ర శాసనసభ రికార్డులు సహా అధికారిక రికార్డుల్లో ఉన్న నివాస చిరునామా ప్రకారం కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశామని అధికారులు తెలిపారు. 'మీ వయస్సును పరిగణనలోకి తీసుకుని, అలాగే సీఆర్‌పీసీ సెక్షన్ 160లోని నిబంధనల ప్రకారం, అధికారిక రికార్డుల్లో ఉన్న మీ నివాస చిరునామాలోనే విచారణ నిర్వహించేందుకు దర్యాప్తు అధికారి నిర్ణయించారు..'అని వెల్లడించారు మీరు కోరినట్లుగా ఎర్రవల్లిలో విచారించడం కుదరదని చెప్తూ.. అధికారిక రికార్డుల్లో ఉన్న నివాసాన్నే (నందినగర్‌లోని ఇల్లు) విచారణ స్థలంగా నిర్ణయించిన విషయం మరొకసారి స్పష్టం చేస్తున్నామని తెలిపారు.

అదే సమయంలో..'విచారణ సందర్భంగా అనేక సున్నిత ఎలక్ట్రానిక్, భౌతిక రికార్డుల పరిశీలన అవసరం. వాటిని ఎర్రవల్లికి తరలించడం కష్టం కాబట్టి మీరు తప్పనిసరిగా హైదరాబాద్ నివాసం (నందినగర్)లో విచారణకు అందుబాటులో ఉండగలరు..'అని సిట్ స్పష్టం చేసింది.

కేసీఆర్ స్పందనపై ఉత్కంఠ

సీఆర్పీసీలోని సెక్షన్ 160 ప్రకారం జరిగే ఈ విచారణకు సంబంధించి చట్టంలో కీలక మార్గదర్శకాలు ఉన్నాయి. 15 ఏళ్ల లోపు, 65 ఏళ్ల పైబడి పురుషులు, మహిళలతో పాటు దివ్యాంగులకు కొన్ని వెసులుబాట్లు ఉన్నాయి. ఈ కేటగిరీలకు చెందిన వాళ్లు ఫలానా ప్రాంతానికి వచ్చి తమ వాంగ్మూలం నమోదు చేసుకోవాలని కోరే అవకాశం ఉంది. దీంతో ఈ రెండో నోటీసుపై కేసీఆర్ స్పందన ఎలా ఉంటుందనే ఉత్కంఠ నెలకొంది.

## ఇక ఉక్కపోత షురూ!




**వారం తర్వాత పెరగనున్న ఉష్ణోగ్రతలు**

**చివరి దశకు చలికాలం.. వేగంగా వాతావరణ మార్పులు**

ఈ-కబురు,హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరాయి. కొంతకాలంగా గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువ స్థాయికి పతనం కావడం... అదేవిధంగా రాష్ట్రానికి ఈశాన్య దిశ నుంచి తక్కువ ఎత్తులో బలమైన గాలులు వీస్తుండటంతో చలి తీవ్రత విపరీతంగా నమోదైంది. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలోనే నమోదవుతున్నాయి.

చలికాలం చివరి దశకు చేరడంతో ఉష్ణోగ్రతలు వేగంగా మారుతున్నాయి. వారం తర్వాత క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. శుక్రవారం రాష్ట్రంలో కొన్నిచోట్ల సాధారణం కంటే ఒక డిగ్రీ సెల్సియస్ తక్కువగా నమోదు కాగా.. కనిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణం కంటే ఒక డిగ్రీ సెల్సియస్ అటుఇటుగా నమోదయ్యాయి.

ఫిబ్రవరి రెండో వారం నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని, చాలా ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకట్రెండు డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

### పోలవరం-నల్లమలసాగర్‌ను

# ఎజెండాలో చేర్చొద్దు




గోదావరినల్లమలసాగర్‌ను మొదటి దశలో ప్రతిపాదించినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ సమయంలో తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశాన్ని ఎజెండాలో చేర్చడానికి వీల్లేదని పేర్కొంది. ''మేము దీనికి అనుమతి ఇవ్వలేదు. ఏ ప్రాజెక్టు కోసం అయినా ప్రతిపాదన వస్తే పరిశీలించి చెప్తాం. అలాగే ఈ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు రాగా.. పరిశీలనకు భాగస్వామ్య రాష్ట్రాలకు పంపాలని, ఆ రాష్ట్రాల అభిప్రాయాలు వచ్చిన తర్వాత ఏ విషయం చెప్తామని తెలిపాం. ఇప్పటివరకు డీపీఆర్ తయారీకి మేము అంగీకారం తెలపలేదు'' అని సీడబ్ల్యూసీ ఛైర్మన్ స్పష్టం చేసినట్లు తెలిసింది. ఏపీ ఇచ్చిన ఎజెండాలోని అంశాల గురించి వివరించిన ఆయన, తెలంగాణ నుంచి ఎజెండా రాకపోవడంపై ప్రశ్నించారు. ఇక్కడ చర్చించిన తర్వాత ఏమి చేర్చాలో నిర్ణయించుకోవాలని అనుకొన్నామని తెలంగాణ అధికారులు చెప్పారు.

వరద నీటికి అర్థం ఏంటో చెప్పాలని కోరారు. 75 శాతం నీటి లభ్యత దాటి వచ్చేవన్నీ మిగులు జలాలే అని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. 75 శాతం నీటి లభ్యత వరకే ప్రాజెక్టులు మంజూరు చేస్తామని, 50 శాతం లేదా సరాసరి నీటి లభ్యత కింద చేయాలంటే బోర్డుల ద్వారా రావాల్సి ఉంటుందని చెప్పారు. ఈ సమయంలో ఏపీ సలహాదారు వెంకటేశ్వరరావు జోక్యం చేసుకొని తాము సముద్రంలోకి వృథాగా వెళ్లే నీటిని వాడుకొంటామని, దానికి అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. వరద జలాలు అనే అంశానికి వేరే నిర్వచనాలు ఉన్నాయని, భవిష్యత్‌లో వాటిని హక్కుగా మార్చుకునే ప్రమాదం ఉందని తెలంగాణ బదులిచ్చింది. 'ఏపీకి అనుమతిస్తే మాకూ ఇవ్వండి. మేమూ ఎగువన వరద నీటిని మళ్లించేలా ప్రాజెక్టును చేపడతాం' అని తెలంగాణ అధికారులు స్పష్టం చేశారు. 'వృథాగా సముద్రంలోకి పోయే నీటిని వాడుకొంటాం అని ఏపీ అంటే, ఎగువన ప్రాజెక్టు కడతాం అనడం సరికాదు. ఈ రెండింటికి తేడా లేదా' అని జల సంఘం ఛైర్మన్ ప్రశ్నించినట్లు తెలిసింది. 'గోదావరిలో రెండు రాష్ట్రాల మధ్య ట్రైబ్యునల్ పంపిణీ లేదా పరస్పరం అంగీకారం లేకుండా కొన్ని ప్రాజెక్టులకు మీరెలా కేటాయింపులు చేశారు' అని ఆంధ్రప్రదేశ్ అధికారులు అడగ్గా, ఇప్పుడు వాటి గురించి చర్చ ఎందుకని సీడబ్ల్యూసీ అధికారులు అన్నట్లు తెలిసింది.

పీఎన్‌ఎస్‌ఎల్‌పీని ఎజెండాలో చేర్చితే సమావేశానికి హాజరుకాలేం: తెలంగాణ

గోదావరి జలాల తరలింపునకు ఏపీ తలపెట్టిన పోలవరంనల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టు (పీఎన్‌ఎస్‌ఎల్‌పీ) అంశాన్ని ఎజెండాలో చేర్చితే కమిటీ సమావేశానికి హాజరుకాలేమని తెలంగాణ పునరుద్ఘాటించింది. ఈ విషయాన్ని గతంలోనే లేఖ ద్వారా స్పష్టం చేశామని తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా స్పష్టం చేశారు. 'నదీ జలాల చట్టాలు, నిబంధనలు అన్ని నదులకూ వర్తిస్తాయి. ఒక నదిలో వరద నీటి వినియోగానికి అనుమతిస్తే ఇంకో నదిలో కూడా ఇవ్వాలి' అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్ కోరారు. కృష్ణా బేసిన్ పరిధిని అనుసరించి నీటి వాటాను పెంచాల్సి ఉందని తెలంగాణ కోరింది. కృష్ణా ట్రైబ్యునల్ తీర్పు వచ్చే వరకు కృష్ణా జలాల్లో యాభై శాతం నీటిని వినియోగించుకునే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అంతేకాకుండా ట్రైబ్యునళ్లలో, సుప్రీంకోర్టు విచారణలో ఉన్న కేసులను ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కు తీసుకోమని స్పష్టం చేసింది. పోలవరం బనకచర్ల/నల్లమలసాగర్ ప్రాజెక్టు ఏ రూపంలో ఉన్నా అనుమతించేది లేదని, కేంద్రం కూడా ఏరకంగానూ ప్రోత్సహించొద్దని సూచించింది. కృష్ణాలో ట్రైబ్యునల్ తీర్పు వచ్చే వరకు 66:34 శాతం కాకుండా యాభైశాతం చొప్పున వినియోగించుకొనేలా తెలంగాణ ప్రతిపాదించగా, ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశం ట్రైబ్యునల్ పరిధిలో ఉందని, దానిపై చర్చించడానికి అవకాశం లేదని ఆంధ్రప్రదేశ్ సలహాదారు వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి...

వారంలోగా రెండు రాష్ట్రాలు ఎజెండా ఖరారు చేసి పంపించాలని సీడబ్ల్యూసీ ఛైర్మన్ సూచించారు. తర్వాత ఒక రాష్ట్రం ఎజెండాలోని అంశాలపై ఇంకో రాష్ట్రం 15 రోజుల్లో స్పందించాలని వివరించింది.

ఆ తర్వాత తుది ఎజెండా ఖరారు చేస్తామని తెలిపింది. 15 రోజుల్లో తదుపరి సమావేశ తేదీని ఖరారు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఎజెండా రూపకల్పనపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించిన తర్వాత ఏ విషయం తెలియజేస్తామని తెలంగాణ తెలిపింది.

12 అంశాలను సిద్ధం చేసుకున్నాం

తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా

'తెలంగాణ, ఏపీ జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశంలో అంశాల వారీగా చర్చ జరగలేదు. ఎజెండా ఖరారయ్యాక వచ్చే సమావేశంలో చర్చిస్తాం' అని తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా పేర్కొన్నారు. శుక్రవారం దిల్లీలో జరిగిన సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రస్తుతం ఎజెండా లేకుండానే సమావేశం జరిగింది. పోలవరంబనకచర్ల అంశం ఎజెండాలో ఉండొద్దన్నది తెలంగాణ వాదన. రాష్ట్రం తరఫున 12 అంశాలను సిద్ధం చేసుకున్నాం. కానీ కమిటీకి సమర్పించలేదు. వారంలోగా రెండు రాష్ట్రాలు ఎజెండా పంపాలని కమిటీ కోరింది. ఆ తర్వాత ఒక్కో అంశంపై తదుపరి సమావేశంలో చర్చిస్తాం. కృష్ణా, గోదావరి పరీవాహకాల్లో పలు సమస్యలు ఉన్నాయి' అని వివరించారు.

## ఇలా పరీక్ష పూర్తి..అవిగో మార్కులు!

TELANGANA COUNCIL OF HIGHER EDUCATION
KNOWLEDGE THROUGH EQUITY

మొదటి పేజీ తరువాయి

ఎంత ర్యాంకు వస్తుందో అంచనాకు రావొచ్చు. ఈ ఏడాది నుంచే ఈ విధానం అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. జేఎన్‌టీయూహెచ్‌లో శుక్రవారం జరిగిన ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్) కమిటీ సమావేశాల్లో చర్చించి పలు వినూత్న సంస్కరణల అమలుకు ఆమోదం తెలిపారు.కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)గా పిలిచే ఆన్‌లైన్ పరీక్ష సమయం ముగియగానే విద్యార్థి ఏమీ చేయకుండానే కంప్యూటర్ ఆగిపోతుంది. తెరపై పరీక్ష ప్రశ్నాపత్రం కనిపించదు. సబ్జెక్టుల వారీగా ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించారు.. ప్రాథమిక కీ ఆధారంగా మొత్తం ఎన్ని మార్కులు వచ్చాయో.. కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. తుది ర్యాంకు మాత్రం చివరి కీతోపాటు పలు విడతలుగా ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతున్నందున నార్మలైజేషన్ విధానాన్ని అమలు చేసి వెల్లడిస్తారు.

**మరికొన్ని నిర్ణయాలు...**

ఎప్‌సెట్, పీజీఈసెట్‌కు ల్యాప్‌టాప్, కంప్యూటర్ల ద్వారానే దరఖాస్తు చేసుకునే విధానం ఉండేది. ఈసారి స్మార్ట్‌ఫోన్ల నుంచి కూడా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలని నిర్ణయించారు. అందుకోసం మొబైల్ ఫ్రెండ్లీ యాప్ రూపొందిస్తున్నారు.

ఇప్పటివరకు అధికారికంగా గత ఏడాది ఫలితాల ఆధారంగా ఎన్ని మార్కులకు ఎంత ర్యాంకు వస్తుందో వెల్లడించడం లేదు. ఈసారి విద్యార్థులు ఒక అంచనాకు వచ్చేందుకు ఎన్ని మార్కులకు ఎంత ర్యాంకు వస్తుందో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. మాక్ టెస్టులు, గత ప్రశ్నపత్రాలను సాధించినప్పుడు వచ్చిన మార్కుల ఆధారంగా తమ ర్యాంకు ఎంత ఉండవచ్చో విద్యార్థులు, తల్లిదండ్రులు తెలుసుకోవచ్చు.

గతంలో రూ.10 వేల ఆలస్య రుసుంతో పరీక్షకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. కొద్ది సంవత్సరాల క్రితం తొలగించారు. ఈసారి దాన్ని మళ్లీ అందుబాటులోకి తీసుకురానున్నారు. పరీక్షలు ప్రారంభించే రెండు రోజుల ముందు వరకు రూ.10 వేల రుసుంతో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తారు. రూ.2,500 నుంచి రూ.10 వేల ఆలస్య రుసుంతో దరఖాస్తు చేసుకునే వారు హైదరాబాద్‌లోనే పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

**విద్యార్థుల ప్రయోజనార్థమే..**

సెట్ కమిటీ సమావేశంలో సమగ్రంగా చర్చించి విద్యార్థులకు సౌకర్యవంతంగా, ప్రయోజనకరంగా ఉండేలా పలు నిర్ణయాలు తీసుకున్నాం. పరీక్ష ముగిసిన వెంటనే స్కోర్ తెలుసుకునే విధానం జీమ్యాట్, జీఆర్‌ఈ, బిట్‌శాట్‌లలో ఉంది. ఎన్ని మార్కులకు ఎంత ర్యాంకు వస్తుందో ఒక అంచనా ఏర్పడటంతో విద్యార్థులు ఫలితాల వరకు ఆగకుండానే తమ భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించుకుంటారు.

## బలం మాకే.. కాదు.. బలగం మాదే




రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, కార్యక్రమాలు, పథకాల దృష్ట్యా నగర, పట్టణ ప్రజలు తమకే పట్టం కడతారని కాంగ్రెస్ బలంగా విశ్వసిస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపొందిన కాంగ్రెస్ ఆ ధీమాతో మంత్రులందరికీ బాధ్యతలు అప్పగించి నగర పాలక సంస్థలు, పురపాలకసంఘాల ఎన్నికల ప్రచారంలోకి దిగింది.

**మంచి ఫలితాలపై భారాస ధీమా**

2020లో జరిగిన ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకున్న భారాస ఈసారి తమ సత్తా చాటడానికి ఉవ్విళ్లూరుతోంది. శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో ఫలితాలు నిరాశపరిచినా పంచాయతీ ఎన్నికల్లో ఆశాజనక ఫలితాలు రావడంతో ఆ పార్టీలో ఆత్మవిశ్వాసం పుంజుకుంది. ఈసారి ఎన్నికల్లో తమ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను తెలియజేయడంతో పాటు అధికార పార్టీ వైఫల్యాలపై విస్తృత ప్రచారం చేసి విజయం సాధించాలనే పట్టుదలతో ఉంది.

**ఎక్కువ స్థానాల్లో గెలుస్తామంటున్న భాజపా**

ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గతంలో కంటే ఎక్కువ స్థానాలను గెలిచిన భాజపా అదే ఉత్సాహంతో పురపాలక ఎన్నికల్లోనూ ఎక్కువ స్థానాల్లో గెలిచి తీరతామని ధీమా వ్యక్తం చేస్తోంది. నిజామాబాద్ లోక్‌సభతో పాటు ఎమ్మెల్యే కూడా ఉండటం భాజపాకు సానుకూలాంశం. ఇక కరీంనగర్ లోక్‌సభకు కేంద్రమంత్రి బండి సంజయ్, మహబూబ్‌నగర్ లోక్‌సభకు డి.కె. అరుణలు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఆయా కార్పొరేషన్లలో మంచి ఫలితాలు వస్తాయన్న నమ్మకంతో ఉంది.

## హార్వర్డ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ పూర్తి



'21వ శతాబ్దంలో నాయకత్వం' అనే అంశంపై ఈ ప్రోగ్రామ్‌ను రోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించారు. ప్రస్తుతం అమెరికాలో మైనస్ 15 నుంచి మైనస్ 24 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు ఉండగా.. తీవ్ర చలి మధ్య ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా విద్యార్థులందరికీ శుక్రవారం ఫ్యాకల్టీ సభ్యులు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం అందరూ గ్రూప్ ఫొటో దిగారు.

# కేసీఆర్ కు సిట్ నోటీసులపై భగ్గుమన్న శేరిలింగంపల్లి బీఆర్ఎస్ శ్రేణులు



మియాపూర్ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న సాయిబాబా తదితరులు

**ప్రజల దృష్టిని మళ్లించే కొత్త కుట్రలకు పాల్పడుతున్న ప్రభుత్వం : కొమిరిశెట్టి సాయిబాబా**

ఈకబురు, శేరిలింగంపల్లి : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై శేరిలింగంపల్లి బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకుల ఆధ్వర్యంలో మియాపూర్ లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మియాపూర్ నుంచి ఆల్విన్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించడంతో పాటు రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ కేసీఆర్ కి సిట్ నోటీసులు ఇవ్వడం ముమ్మాటికీ డైవర్షన్ పాలిటిక్స్ లో భాగమేనని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తన డ్రామాలను కట్టిపెట్టి, ప్రజలకిచ్చిన హామీలు, పరిపాలనపై దృష్టి పెడితే మంచిదన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని బొగ్గు కుంభకోణం, ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేని తమ అసమర్థతను, వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకత్వాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేధిస్తున్నదన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా ప్రభుత్వాన్ని వదిలి పెట్టేది లేదన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు విచారణల పేరుతో కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో చందానగర్ మాజీ కార్పొరేటర్ నవతా రెడ్డి, నాయకులు వాలా హరీష్ రావు, కలిదిండి రోజా, శ్రీనివాస్ గౌడ్, దారుగుపల్లి నరేష్, రమేష్ గౌడ్, శ్రీనివాస్, పార్నంది శ్రీకాంత్, అలాఉద్దీన్ పటేల్, బాబు మోహన్ మల్లేష్, సంగారెడ్డి, రామకృష్ణ గౌడ్, గోపరాజు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర!



మరోవైపు మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ఆకస్మిక మృతి నేపథ్యంలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) చీలిక వర్గాల పునరేకీకరణను గురించిన ఊహాగానాలు ఊపందుకున్నాయి. చీలిక వర్గాల కలయికకు కసరత్తు జరుగుతున్న విషయం వాస్తవమేనని, ఇందుకు సంబంధించి అజిత్ పవార్ జీవించి ఉండగానే ప్రారంభమైన చర్చలు కీలక దశకు చేరుకున్నాయని అభిజ్ఞవర్గాలు పేర్కొన్నాయి. పుణె, చించ్వాడ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇరు వర్గాలు కలిసి పోటీ చేశాయి కూడా. రెండు చీలిక వర్గాలను విలీనం చేసే ఉద్దేశంతో గత కొంతకాలంగా అజిత్ పవార్ తన బాబాయి శరద్ పవార్‌తో అనేకమార్లు భేటీ అయ్యారని సమాచారం.శరద్ పవార్ వర్గానికి చెందిన సుప్రియా సూలే, జయంత్ పాటిల్‌తో కూడా చర్చలు జరిగాయి. భాజపా సీనియర్ నేతలకు ఈ పరిణామాల సమాచారం తెలుసునని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. చీలిక వర్గాల పునరేకీకరణ జరిగితే వ్యవస్థాపక నాయకుడైన శరద్ పవార్ సహజంగానే కేంద్ర స్థానాన్ని ఆక్రమించి పార్టీ శ్రేణులకు మార్గనిర్దేశం చేసే అవకాశం ఉంది. సునేత్ర ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తే పునరేకీకరణ ప్రయత్నాలకు విఘాతం కలుగుతుందా? అప్పుడు విలీనం కోరుకుంటున్న నాయకుల వైఖరి ఎలా ఉంటుంది?అన్నది వేచి చూడాల్సిందే. సునేత్రా పవార్‌ను పార్టీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకోవడానికి ఎలాంటి అడ్డంకులూ లేవని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్ శుక్రవారం స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్ర ఆర్థిక మంత్రిత్వ శాఖను నిర్వహించిన అజిత్ పవార్ మృతిచెందిన నేపథ్యంలో వచ్చే నెల శాసన సభ సమావేశాల్లో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ 202627 బడ్జెట్ సమర్పించే అవకాశాలున్నాయి.

విచారణ ప్రారంభించిన సీఐడీ..... బారామతిలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణానికి దారితీసిన విమాన ప్రమాద ఘటనపై మహారాష్ట్ర నేర పరిశోధన విభాగం (సీఐడీ) విచారణ ప్రారంభించింది.

# మహాత్మాగాంధీ ఆలోచనా విధానాన్ని ద్వేషంతో తుడిచిపెట్టలేరు: రాహుల్



**–+గాంధీ స్మృతి వద్ద నివాళులర్పిస్తున్న రాహుల్ గాంధీ**

ఈ కబురు, దిల్లీ: మహాత్మాగాంధీ ఒక వ్యక్తి మాత్రమే కాదని, ఒక ఆలోచనా ధారగా కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. సామ్రాజ్య దురహంకారం, ద్వేష భావజాలాలు బాపు ఆలోచనలను తుడిచిపెట్టేందుకు పలు సందర్భాల్లో విఫల యత్నాలు చేశాయన్నారు. జాతిపిత వర్ధంతి సందర్భంగా శుక్రవారం రాహుల్ 'ఎక్స్' ద్వారా ఆయనకు నివాళులు అర్పించారు. మహాత్ముడిని అమరత్వం గల భారతదేశపు ఆత్మగా అభివర్ణించారు. మన దేశానికి స్వాతంత్ర్యంతోపాటు అధికార బలం కంటే సత్యానికి ఉన్న విలువ గొప్పదనే ప్రాథమిక సూత్రాన్ని జాతిపిత అందించారన్నారు. తీస్ జనవరి మార్గ్‌లోని గాంధీ స్మృతి వద్ద సైతం రాహుల్ పుష్పాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ సహా పలువురు కాంగ్రెస్ నేతలు మహాత్ముడికి నివాళులు అర్పించారు.

గాంధీ పేరుతో చట్టం మోదీకి నచ్చదు: మహాత్మాగాంధీ పేరుతో ముడిపడిన ఎంజీనరేగా చట్టం ఎక్కువకాలం కొనసాగడం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నచ్చదని కాంగ్రెస్ పార్టీ శుక్రవారం విరుచుకుపడింది. ఎంజీనరేగా రద్దును నిరసిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యాలయం నుంచి చేపట్టిన 'ఎంజీనరేగా బచావో సంగ్రామ్ యాత్ర'లో పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ వ్యాఖ్య చేశారు. గాంధీ స్మృతి వరకు కాంగ్రెస్ సీనియర్ నేతలు నిర్వహించ తలపెట్టిన ప్రదర్శనను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు.

# నదీజలాల్లో రాష్ట్ర వాటా పరిరక్షిస్తాం

ఈ కబురు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి నదీజలాల్లో చుక్కనీటిని కూడా వదులుకునేది లేదని, రాష్ట్ర వాటాను పరిరక్షిస్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. నదుల నీటి అంశంపై పదేపదే అబద్ధాలు చెబితే తెలంగాణ సమాజం నమ్ముతుందన్న భ్రమలో భారాస నాయకులు ఉన్నారని పేర్కొన్నారు. శుక్రవారం జూమ్ ద్వారా విలేకరుల సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. ''రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే నీటిహక్కుల కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నాం. భారాస చేసిన పొరపాట్లు సరిదిద్దుతున్నాం. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన 811 టీఎంసీలలో.. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకాలు చేయలేదా? సీఎంగా కేసీఆర్.. నీటిపారుదలశాఖ మంత్రిగా హరీశ్‌రావు ఉన్నప్పుడే ఈ ఒప్పందం జరిగిన మాట వాస్తవం కాదా? ఇప్పుడు మేం కృష్ణా జలాల్లో 70 శాతం వాటా కోసం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌లో పోరాడుతున్నాం. పోలవరం నల్లమలసాగర్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నాం. పలు సంస్థలకు దీనిపై లేఖలు రాశాం. దీనిపై వేసిన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూచనలతో వెనక్కి తీసుకున్నాం. ఒరిజినల్ సూట్ వేస్తున్నాం. ఈ ప్రాజెక్టు పీఎఫ్ఆర్‌పైనా, ఇతర ప్రాజెక్టులపైనా రెండురోజుల క్రితం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్‌పాటిల్‌కు లేఖ రాశాం. పీఎఫ్ఆర్‌కు సంబంధించి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని.. ఆయన లేఖ ద్వారా సమాధానమిచ్చారు. అయినప్పటికీ భారాస నాయకులు అబద్ధాలు చెప్పి సమాజాన్ని మోసం చేసేందుకు యత్నిస్తున్నారు.

---నాడు విందు రాజకీయాలు చేయలేదా?

నాడు జగన్‌మోహన్‌రెడ్డికి విందు ఇచ్చి గోదావరి జలాలను రాయలసీమకు తీసుకెళ్లి రతనాల సీమ చేస్తామని కేసీఆర్ అనలేదా..? రోజా ఇంటికి వెళ్లి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఎవరూ మర్చిపోరు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడిన రాష్ట్రంలో పదేళ్లపాటు భారాస రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేసింది. జల ద్రోహానికి పునాది వారి హయాంలోనే పడింది. పదేళ్లలో రూ.17 లక్షల కోట్లు బడ్జెట్ కింద ఖర్చు చేస్తే దానిలో నీటిపారుదలకు రూ.1.80 లక్షల కోట్లు వ్యయం చేసింది. రూ.లక్ష కోట్లు కాళేశ్వరానికే ఖర్చు చేయగా.. అది వారి హయాంలోనే కుప్పకూలింది. ఆ ప్రాజెక్టు నిర్మించిన ఐదేళ్లలో ఎత్తిపోసింది 160 టీఎంసీలే. దానిలో సముద్రంలోకి వదిలేయగా వినియోగించింది 70 టీఎంసీలే. ఆ నీటితో 17 లక్షల ఎకరాలకు సాగునీరు ఎలా ఇచ్చారో హరీశ్‌రావు లెక్కలు చెప్పాలి. సీడబ్ల్యూసీ ఛైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంపై ఆయన తెలుసుకుని మాట్లాడాలి. పోలవరంనల్లమల సాగర్ ప్రాజెక్టును ఎజెండాలో చేర్చొద్దని ఈ సమావేశంలో అధికారులు వాదించారు. తెలంగాణ ప్రాజెక్టులపై అవగాహన ఉన్న ఆదిత్యనాథ్ దాస్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించుకున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులకు ఆదిత్యనాథ్ దాస్, ఏపీ ప్రాజెక్టులకు ఎస్కే జోషి ఇన్‌ఛార్జులుగా పనిచేశారు. మేం దాస్‌ను సలహాదారుగా నియమించుకుంటే, నాడు భారాస హయాంలో జోషిని నియమించుకున్నారు' అని ఉత్తమ్ పేర్కొన్నారు.



# షరతులకు అంగీకరించకున్నా దిల్లీకెందుకు వెళ్లారు?

హైదరాబాద్: గోదావరి జలాలపై తాము ప్రతిపాదించిన రెండు షరతులకు ఒప్పుకొంటేనే దిల్లీలో సమావేశానికి వస్తామని చెప్పిన తెలంగాణ ప్రభుత్వం.. ఇప్పుడు వాటికి అంగీకరించకపోయినా అధికారులను ఎందుకు పంపిందని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ప్రశ్నించారు. పోలవరంనల్లమలసాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తోందని ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. 'పోలవరంనల్లమలసాగర్‌పై నేను గతేడాది డిసెంబరు 30న నిలదీస్తే.. తెలంగాణ ప్రభుత్వం జనవరి 1న కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖకు లేఖ రాసింది. అందులో ప్రధానంగా రెండు షరతులను అడిగింది. మొదటిది.. నల్లమలసాగర్‌కు డీపీఆర్ వెంటనే ఆపాలి, కేంద్రం అనుమతుల ప్రక్రియను తక్షణం నిలిపివేయాలి. రెండోది.. ప్రీ ఫీజిబిలిటి రిపోర్టు ఆపినట్లు ఏపీ హామీ ఇవ్వాలి. వీటికి అంగీకరిస్తేనే దిల్లీ మీటింగుకు వస్తామని స్పష్టంచేసింది. మరి ఈ రెండు షరతులకు కేంద్రం హామీ ఇచ్చిందా? ఏపీ ప్రభుత్వం ఒప్పుకొందా? అయినా ఎందుకు దిల్లీ సమావేశంలో పాల్గొంటున్నారు? బనకచర్ల అయినా.. నల్లమలసాగర్ అయినా.. మారింది పేరు మాత్రమే. ఏపీ జల దోపిడీ మాత్రం ఆగలేదు. దిల్లీ సమావేశానికి వెళ్లిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి.. గతంలో మన ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఏపీ ప్రభుత్వం తరఫున పనిచేసిన వ్యక్తి. అలాంటి వ్యక్తిని పంపడమంటే.. తెలంగాణకు ద్రోహం చేయడానికే. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఇప్పటికైనా తెలంగాణ ప్రయోజనాల కోసం మాట్లాడాలి. రాష్ట్ర నీటి హక్కుల కోసం కేసీఆర్ నాయకత్వంలో మరో పోరాటం చేస్తాం' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.




# టిప్పర్ లారీని ఢీకొట్టిన మరో లారీ..



ప్రమాద స్థలంలో రెండు లారీలు

**లారీ క్యాబిన్ లో ఇరుక్కుని తీవ్రగాయాలతో డ్రైవర్ మృతి..**

ఈకబురు, శేరిలింగంపల్లి : రోడ్డుపై ప్రమాదకరంగా ఆగి ఉన్న టిప్పర్ లారీని వెనుక నుండి వచ్చిన ఇసుక లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇసుక లారీ క్యాబిన్ లో ఇరుక్కుపోయిన డ్రైవర్ తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇన్స్పెక్టర్ బాలరాజు కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా కొణిదెల గ్రామానికి చెందిన తన్నీరు శ్రీనివాస కార్తిక్(18) గోకుల్ ఫ్లాట్స్ లోని వెంకట రమణ కాలనీలో తన బాబాయ్ వద్ద నివాసం ఉంటూ లారీ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున కార్తిక్ ఇసుక లోడ్ తో కోకాపెట్ నుండి వట్టినాగులపల్లి వైపు వెళ్తుండగా మార్గమధ్యలో డంపింగ్ యార్డ్ వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా నిలిపి ఉన్న టిప్పర్ లారీని వెనుక నుండి ఢీకొట్టాడు. లారీ ముందు భాగం మొత్తం నుజ్జునుజ్జు కాగా లారీ క్యాబిన్ లోనే కార్తిక్ ఇరుక్కుపోయాడు. గమనించిన స్థానికులు కార్తిక్ ను బయటకు తీసుకురాగా అప్పటికే తీవ్ర గాయాలతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# అమెరికా ఆర్థికశాఖపై ట్రంప్ దావా



2024లో ట్రంప్‌నకు సంబంధించిన పన్నుల సమాచారాన్ని లీక్ చేశారన్న ఆరోపణపై ఐఆర్ఎస్ మాజీ కాంట్రాక్టర్ చార్లెస్ ఎడ్వర్డ్ లిటిల్ జాన్ అనే వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. ఈ సమాచారాన్ని లిటిల్‌జాన్ 2018, 2020 మధ్య కాలంలో ''ద న్యూయార్క్ టైమ్స్'', ''ప్రోపబ్లికా'' మీడియా సంస్థలకు అందించారని ప్రాసిక్యూషన్ అభియోగం. లిటిల్‌జాన్ చర్యలు ఓటర్లపై ప్రభావం చూపి 2020 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమికి కారణమైందని దావాలో పేర్కొన్నారు. లిటిల్ జాన్ లీక్ చేసిన సమాచారం తన ప్రతిష్ఠను దెబ్బతీయడంతోపాటు ఆర్థిక నష్టాన్ని కలిగించిందని ట్రంప్ పేర్కొన్నారు. లిటిల్ జాన్‌కు జైలు శిక్ష విధించిన నేపథ్యంలో ఆయన పనిచేసిన బూజ్ అలన్ హ్యామిల్టన్ సంస్థతో అమెరికా ఆర్థిక శాఖ ఈ వారం తెగతెంపులు చేసుకుంది. శిక్షకు గురైన లిటిల్ జాన్ ట్రంప్‌తో పాటు అమెరికాకు చెందిన వేల మంది ధనికుల పన్ను సమాచారంపై కూడా మీడియా సంస్థలకు ఉప్పందించాడు. ఈ సమాచారం లీక్ కావడాన్ని నిలువరించడంలో రెండు ప్రభుత్వ విభాగాలూ విఫలమ

# ఇక సమాచార హక్కునూ చంపుతారా?



సమాచార హక్కు చట్టాన్ని ఒక పద్ధతి ప్రకారం బలహీనపరుస్తున్న మోదీ సర్కారు సత్యాన్వేషకులను శిక్షించే భయానక వాతావరణం సృష్టిస్తోందని 'ఎక్స్' ద్వారా ఆయన ధ్వజమెత్తారు. 2014 నుంచి ఇప్పటిదాకా వందమందికి పైగా ఆర్టీఐ కార్యకర్తలు హత్యకు గురయ్యారని వెల్లడించారు. ''ఈ చట్టం కింద సమాచార వెల్లడి నిలిపివేతకు 'మంత్రుల వీటో'ను సూచించిన ఆర్థిక సర్వే ప్రభుత్వ రికార్డులకు ప్రజల పరిశీలన నుంచి రక్షణ కల్పించే యోచన చేస్తోంది. 2025 నాటికి ఆర్టీఐకి సంబంధించి 26,000 పెండింగు కేసులు ఉన్నాయి. ఈ చట్టానికి స్వతంత్ర కాపలాదారులుగా ఉన్న అధికారులను లొంగదీసుకునే ప్రయత్నాలను 2019 నుంచే ప్రారంభించారు'' అని ఖర్గే నిరసన వ్యక్తం చేశారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023 ఆర్టీఐలోని ప్రజాప్రయోజన నిబంధనను తుడిచిపెట్టిందన్నారు. ఆర్టీఐలో కీలకమైన చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పోస్టును గత 11 ఏళ్లలో ఏడుసార్లు కావాలనే ఖాళీగా పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ సర్కారు 2014లో ఆమోదం తెలిపిన విజిల్ బ్లోయర్స్ రక్షణ చట్టాన్ని భాజపా సర్కారు ఇప్పటిదాకా అమలు చేయలేదని ఖర్గే గుర్తు చేశారు.

# జాతిపితకు దేశం ఘననివాళి

ఈ కబురు, దిల్లీ: మహాత్మాగాంధీ 78వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం యావద్దేశం ఆయనను స్మరించుకుంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ.. జాతిపితకు నివాళులర్పించారు. దిల్లీలోని రాజ్‌ఘాట్‌కు చేరుకొని గాంధీజీ స్మారకస్థలి వద్ద అంజలి ఘటించారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు మరికొందరు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్ముడి సేవలను స్మరించుకున్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు మహాత్ముడికి ఘననివాళి అర్పించారు. సుప్రీంకోర్టు, దిల్లీ హైకోర్టు ప్రాంగణాల్లో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. 1948 జనవరి 30 గాంధీ మరణించిన రోజును ఏటా అమరవీరుల దినోత్సవంగా జరుపుకొంటున్న విషయం తెలిసిందే.



# అమెరికా ఫెడ్ రిజర్వ్ కొత్త గవర్నర్ వార్ష్!

**నామినేట్ చేయనున్నట్లు ట్రంప్ ప్రకటన**
**కేంద్ర బ్యాంకు వైట్ హౌస్ ఆధీనంలోకి వెళ్తుందా?**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవిని చేపట్టినప్పటి నుంచీ, కీలక రేట్లు తగ్గించమని, తమ కేంద్రబ్యాంక్ అయిన ఫెడరల్ రిజర్వ్‌కు చెబుతూనే వస్తున్నారు. ఫెడ్ ప్రస్తుత ఛైర్మన్ జెరోమ్ పావెల్ అంతగా పట్టించుకోలేదు. ఈ ఏడాది మేలో ఈయన పదవీకాలం ముగియనుండగా, కొత్త గవర్నర్‌గా కెవిన్ వార్ష్‌ను నామినేట్ చేయనున్నట్లు ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. 2017లో పావెల్‌ను ఎంచుకుందీ ట్రంపే. ఎవరీ వార్ష్: ఫెడ్ బోర్డు సభ్యుడిగా 200611 మధ్య పనిచేసిన వార్ష్, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి అధిక వడ్డీ రేట్లకే మద్దతు ఇచ్చేవారు. తక్కువ వడ్డీ రేట్ల విధానాన్ని వ్యతిరేకించారు. 200809 మహా మాంద్యం సమయంలో ఫెడ్ విధానాలను ఆయన ఒప్పుకోలేదు. అప్పట్లో ఫెడ్ గవర్నర్‌గా ఎంపికైన అతి తక్కువ వయసున్న(35) వ్యక్తిగా వార్ష్ నిలిచారు. ఇటీవలి కాలంలో తక్కువ వడ్డీ రేట్లకు మద్దతు పలకడం, ట్రంప్ రెండో సారి అధ్యక్ష పదవిని చేపట్టాక, ఆయన విధానాలకు వార్ష్ మద్దతివ్వడమే తాజా ఎంపికకు కారణాలుగా చెబుతున్నారు. సెనేట్ కూడా సమర్థిస్తేనే ఫెడ్ ఛైర్‌గా వార్ష్ బాధ్యతలు స్వీకరిస్తారు. గుప్పిట పెట్టుకోవడానికేనా: ట్రంప్ ప్రకారం.. అమెరికాలో కీలక రేట్లు 1% వద్ద ఉండాలి. ప్రస్తుత 3.5% ఆయన అంచనాకు చాలా దూరంగా ఉంది. అందుకే స్వతంత్ర సంస్థ అయిన ఫెడ్‌పై నియంత్రణ కోసమే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని అంచనా. అమెరికా ద్రవ్యోల్బణాన్ని తక్కువ స్థాయుల్లో ఉంచేందుకు, ఉద్యోగ నియామకాలకు మద్దతు పలకడంతో పాటు, బ్యాంకింగ్ నియంత్రణాధికార సంస్థగానూ ఫెడ్ వ్యవహరిస్తుంది. ఫెడ్ నిర్ణయాల వల్ల తనఖా, వాహన, క్రెడిట్ కార్డు వంటి అన్ని రుణాలపై ప్రభావం పడుతుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఇంత ప్రభావాన్ని చూపే ఫెడ్, ట్రంప్ చెప్పినట్లు వింటే, తలెత్తే పరిణామాలు ఎలా ఉంటాయో చూడాల్సి ఉంది.

# ద్రవ్యలోటు రూ.8.55 లక్షల కోట్లు

**బడ్జెట్ అంచనాతో పోలిస్తే 54.5%**



దేశ ద్రవ్యలోటు 2025 డిసెంబరు చివరకు రూ.8.55 లక్షల కోట్లుగా నమోదైంది. 202526 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు, జీడీపీలో 4.4% లేదా రూ.15.69 లక్షల కోట్లుగా ఉండొచ్చని కేంద్రం అంచనా వేసింది. ఈ అంచనాల్లో తాజా గణాంకాలు 54.5 శాతానికి సమానం. 202425 ఇదే సమయంలో ద్రవ్యలోటు బడ్జెట్ లక్ష్యంలో 56.7 శాతంగా ఉంది. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల వ్యత్యాసాన్ని ద్రవ్యలోటుగా పరిగణిస్తారు. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) గణాంకాల ప్రకారం..డిసెంబరు చివరకు ప్రభుత్వానికి రూ.25.25 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. బడ్జెట్ అంచనాల్లో ఈ మొత్తం 72.2 శాతానికి సమానం. ఇందులో రూ.19.39 లక్షల కోట్లు పన్నుల రూపేణ, రూ.5.39 లక్షల కోట్లు పన్నేతర ఆదాయంగా లభించింది. రుణ రహిత పెట్టుబడి సాధనాల్లో రూ.46,047 కోట్లు సమకూరాయి. ఏప్రిల్ డిసెంబరు నెలల్లో పన్ను ఆదాయంలో వాటా రూపేణ రాష్ట్రాలకు రూ.10.38 లక్షల కోట్లు బదిలీ చేశారు. 202425 ఇదే కాలంలో బదిలీ చేసిన మొత్తం కంటే ఇది రూ.1.37 లక్షల కోట్లు అధికం. ఏప్రిల్ డిసెంబరులో మొత్తం ప్రభుత్వ వ్యయాలు రూ.33.8 లక్షల కోట్లకు చేరాయి. బడ్జెట్ అంచనాల్లో ఇవి 66.7 శాతానికి సమానం. ఇందులో రూ.25.93 లక్షల కోట్లు రెవెన్యూ వ్యయాలు కాగా.. రూ.7.87 లక్షల కోట్లు పెట్టుబడి వ్యయాలు. రెవెన్యూ వ్యయాల్లో రూ.9.11 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు, రూ.3.17 లక్షల కోట్లు ప్రధాన రాయితీలకు వెచ్చించారు.

# బడ్జెట్‌కు ముందు అప్రమత్తత

**సూచీలు మళ్లీ నష్టాల బాట**
**ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.2251.37 కోట్లు**
**డీఐఐ అమ్మకాలు.. రూ.601.03 కోట్లు**



కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న (ఆదివారం) వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండటంతో... ముందుజాగ్రత్తగా మదుపర్లు శుక్రవారం లాభాలు స్వీకరించారు. దీంతో వరుసగా మూడు రోజుల పాటు లాభాల్లో కొనసాగిన సూచీలు.. శుక్రవారం నష్టాలతో ముగిశాయి. లోహ, ఐటీ, కమొడిటీ షేర్లలో అమ్మకాలు, రూపాయి బలహీనతలు కూడా ఇందుకు కారణమయ్యాయి. అయితే కొన్ని బ్లూచిప్ షేర్ల రాణింపుతో సూచీల నష్టాలు పరిమితమయ్యాయి.డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 6 పైసలు పెరిగి 91.93 వద్ద ముగిసింది. ఒక దశలో డాలర్ విలువ రూ.92.02 వద్ద తాజా రికార్డు గరిష్ఠాన్ని తాకింది కూడా. బ్రెంట్ ముడి చమురు 0.16% నష్టంతో 70.57 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా మినహా మిగతా దేశాల సూచీలన్నీ నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.6000 కోట్లు పెరిగి, రూ.460.02 లక్షల కోట్ల (5.01 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

**ఆద్యంతం నష్టాల్లోనే .....** ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 81,947.31 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 82,566.37) ప్రారంభమైంది. ఆ తర్వాత స్వల్ప శ్రేణికి పరిమితమై కదలాడుతూ, చివరకు 296.59 పాయింట్ల నష్టంతో 82,269.78 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 98.25 పాయింట్లు కోల్పోయి 25,320.65 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,213.65 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 25,370.70 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది.

**సగం అటు.. సగం ఇటు....** సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో సగం కంపెనీలు లాభాల్లో.. మిగతావి నష్టాల్లో ముగిశాయి. టాటా స్టీల్ 4.57%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.10%, పవర్‌గ్రిడ్ 1.61%, హెచ్‌సీఎల్ టెక్ 1.55%, టెక్ మహీంద్రా 1.39%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.05% తగ్గాయి. మహీంద్రా అండ్ మహీంద్రా 1.38%, ఎస్‌బీఐ 1.23%, ఐటీసీ 1.11%, భెల్ 1.01%, టైటన్ 0.99%, హిందుస్థాన్ యునిలీవర్ 0.94% పెరిగాయి.

**లోహ షేర్లకు నష్టాలు....** ఇటీవలి ర్యాలీ అనంతరం లాభాల స్వీకరణ కారణంగా, లోహ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. హిందుస్థాన్ జింక్ 12.12%, వేదాంతా 10.89%, నేషనల్ అల్యూమినియం కంపెనీ 10.32%, హిందాల్కో ఇండస్ట్రీస్ 6.12%, టాటా స్టీల్ 4.57%, ఎన్ఎమ్‌డీసీ 4.19%, సెయిల్ 3.94%, జిందాల్ స్టీల్ 2.12%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.97% చొప్పున నష్టపోయాయి.

**వివర్క్ ఇండియా రూ.100 కోట్ల పెట్టుబడి....** హైదరాబాద్‌లో మరో 3,300 డెస్క్‌లు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా అదనపు సామర్థ్యాన్ని సమకూర్చుకుంటున్నట్లు వివర్క్ ఇండియా మేనేజ్‌మెంట్ ప్రకటించింది. ఇందుకోసం రూ.100 కోట్ల పెట్టుబడి పెడతామంది. ఈ ఏడాది జూన్‌కు ఈ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపింది. ఈ సంస్థకు ప్రస్తుతం 1,21,638 డెస్క్‌ల సామర్థ్యం ఉంది.

# 20% తగ్గిన వెండి ఈటీఎఫ్‌లు

**లాభాల స్వీకరణతో భారీగా దిద్దుబాటు**




అంతర్జాతీయ మార్కెట్లో రికార్డు స్థాయిల వద్ద ట్రేడవుతున్న బంగారం, వెండి ధరలు శుక్రవారం ఒక్కసారిగా కుప్పకూలాయి. ఈ పరిణామంతో వెండి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు కూడా 20 శాతానికి మించి పతనం అయ్యాయి. దేశీయ మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.33,113 (18%) తగ్గి 10 గ్రాములకు రూ.1,50,849కు పడిపోయింది. గురువారం ఈ కాంట్రాక్టు రూ.1,93,096 వద్ద జీవితకాల గరిష్ఠాన్ని తాకింది. వెండి మార్చి కాంట్రాక్టు రూ.1,07,971 (27%) తగ్గి కిలోకు రూ.2,91,922కి పడిపోయింది. గురువారం ఇది రూ.4,20,048 వద్ద జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. వెండి మే, జులై కాంట్రాక్టులు కూడా వరుసగా 27%, 24% క్షీణించాయి. ఈ ప్రభావం గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లపై పడింది. దీంతో మదుపరులు భారీగా నష్టపోయారు. ఎస్‌బీఐ సిల్వర్ ఈటీఎఫ్ 20.50%, యాక్సిస్ సిల్వర్ ఈటీఎఫ్ 20.16%, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ సిల్వర్ ఈటీఎఫ్ 20.14% క్షీణతను నమోదు చేశాయి. కోటక్, డీఎస్‌పీ, ఎడిల్‌వీజ్, యూటీఐ, మోతీలాల్ సిల్వర్ ఈటీఎఫ్‌లూ 19% వరకు పతనం అయ్యాయి. బంగారం విషయంలోనూ గత ఏడాది కాలంగా 104% భారీ రాబడిని అందించిన నిప్పాన్ ఇండియా ఈటీఎఫ్ గోల్డ్ బీఈఎస్ శుక్రవారం 10.52% పతనం అయ్యింది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, యాక్సిస్, కోటక్, మిరే అసెట్‌ల గోల్డ్ ఈటీఎఫ్‌లూ 912% పతనం అయ్యాయి. ఎందుకీ పతనం.. అమెరికా ఫెడరల్ రిజర్వ్ కొత్త ఛైర్మన్‌గా కఠిన నిర్ణయాలు తీసుకునే కెవిన్ వార్ష్‌ను నియమితులు కానుండటం మార్కెట్‌ను కలవరపెడుతున్నాయి. మే నెలలో జెరోమ్ పావెల్ పదవీకాలం ముగియనుండటంతో, ఆ స్థానంలో కెవిన్ వస్తారు. ఈ పరిణామంతో డాలర్ పుంజుకుని, బంగారం ధరలపై ఒత్తిడి పెరగడానికి కారణం అయ్యింది.

**మదుపరులు ఏం చేయాలి?....** ఈ భారీ పతనాన్ని కొనుగోలు అవకాశంగా భావించాలా? లేక మార్కెట్ స్థిరపడే వరకూ వేచి చూడాలా అనే విషయంలో 'జాగ్రత్తగా ఉండాలని' నిపుణులు సూచిస్తున్నారు. సోలార్ ప్యానెల్స్, విద్యుత్ వాహనాలు (ఈవీ), కృత్రిమ మేధ మౌలిక వసతుల రంగాల నుంచి వెండికి గిరాకీ బలంగా ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యే అవకాశం కనిపిస్తోందని పేర్కొంటున్నారు. 2025లో భారీ లాభాల తర్వాత, ఇప్పుడు ఒకేసారి మొత్తం పెట్టుబడిని వెండికే కేటాయించడం ప్రమాదకరమని అంటున్నారు. ఈ లోహాల ధరలు బాగా తగ్గినా కూడా, జాగ్రత్తగా గమనించాలని.. వారాలు/నెలల్లో విడతలవారీగా కొనుగోలు చేయడం ఉత్తమమని చెబుతున్నారు. సురక్షిత పెట్టుబడి కోసం పోర్ట్‌ఫోలియోలో 1015% వరకు ఈ లోహాలకు కేటాయించొచ్చని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ఆకాశాన్నంటిన ధరల కారణంగా భారత్‌లో పసిడికి గిరాకీ గణనీయంగా తగ్గింది.

# ఎన్ఎస్ఈ పబ్లిక్ ఇష్యూకు సెబీ పచ్చజెండా




దశాబ్దకాల నిరీక్షణకు తెరపడబోతోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) మరికొన్ని నెలల్లోనే పబ్లిక్ ఇష్యూకు వచ్చే అవకాశం ఉంది. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) నిమిత్తం ఎన్ఎస్ఈకి నిరభ్యంతర ధ్రువీకరణపత్రాన్ని (ఎన్ఓసీ) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ జారీ చేసిందని ఎన్ఎస్ఈ ఛైర్‌పర్సన్ శ్రీనివాస్ ఇంజేటి శుక్రవారం తెలిపారు. నియంత్రణపరమైన ఆందోళన, కోలొకేషన్ కేసు వ్యవహారం కారణంగా 2016 నుంచి ఎన్ఎస్ఈ ఐపీఓకు అనుమతులను సెబీ ఆపుతూ వస్తున్న సంగతి తెలిసిందే. ప్రతిపాదిత ఎన్ఎస్ఈ ఐపీఓ.. దేశంలోని అతిపెద్ద ఐపీఓల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. 2016లో సెబీకి ముసాయిదా పత్రాలను సమర్పించినప్పుడే.. రూ.10,000 కోట్లు సమీకరించేందుకు ఎన్ఎస్ఈ ప్రతిపాదించింది. ఇప్పుడు 1.77 లక్షల మంది వాటాదార్లున్న ఎన్ఎస్ఈ మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లుగా గ్రేమార్కెట్ భావిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. సెబీ అనుమతులపై ఎన్ఎస్ఈ మేనేజింగ్ డైరెక్టరు, సీఈఓ ఆశిశ్ కుమార్ చౌహాన్ స్పందిస్తూ.. ఎన్ఎస్ఈ ఐపీఓకి సూత్రప్రాయ అనుమతులు లభించడం సానుకూల పరిణామం అన్నారు. 'సెబీ ఎన్ఓసీ లభించాక, ఐపీఓ కోసం ముసాయిదా పత్రాల సమర్పణకు 4 నెలల సమయం పడుతుంది. ఆ తర్వాత నియంత్రణపరమైన అనుమతులు లభిస్తాయి. ఇవన్నీ పూర్తయి.. ఐపీఓ ప్రారంభమయ్యేందుకు సుమారు 78 నెలల సమయం పడుతుందని' చౌహాన్ తెలిపారు.

# భారత్‌కు ఏటా 810 బి. డాలర్ల ప్రపంచ బ్యాంకు రుణాలు




వచ్చే అయిదేళ్ల పాటు ఏటా 810 బి. డాలర్ల (దాదాపు రూ.72,80091,000 కోట్ల) మేర రుణాలు ఇవ్వడానికి ప్రపంచబ్యాంకు అంగీకరించింది. ఆ మేరకు కొత్త కంట్రీ పార్టనర్‌షిప్ ఫ్రేమ్‌వర్క్ (సీపీఎఫ్)ను ప్రపంచ బ్యాంక్ గ్రూప్, భారత్ ప్రకటించాయి. ఒక అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారాలన్న మనదేశ లక్ష్యానికి అనుగుణంగా, తదుపరి వృద్ధి దశను వేగవంతం చేసేందుకు ఈ రుణాలు సహాయపడతాయి. 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా సీపీఎఫ్ ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. ప్రైవేటు పెట్టుబడులకు ప్రభుత్వ నిధులను జత చేసి గ్రామీణ, పట్టణ భారత్‌లో మరిన్ని ఉద్యోగాలను సృష్టించడంపై సీపీఎఫ్ దృష్టిసారిస్తుందని ఆమె అన్నారు. ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ అజయ్ బంగా నేతృత్వంలోని బృందంతో చర్చలు జరిపిన అనంతరం, ఆర్థిక మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

# శామ్‌సంగ్ నుంచి ఏఐ ఏసీలు 30%వరకు విద్యుత్ ఆదా



ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల దిగ్గజం శామ్‌సంగ్ ఇండియా, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత విండ్‌ఫ్రీ ఎయిర్ కండీషనర్లను (ఏసీలు) అందుబాటులోకి తేనుంది. వీటి ద్వారా వినియోగదార్లకు 30% వరకు విద్యుత్ ఆదా అవుతుందని కంపెనీ తెలిపింది. భారత్‌లో రూమ్ ఏసీల విభాగం మొత్తానికి ఏఐ సాంకేతికతను అనుసంధానం చేసిన తొలి కంపెనీగా శామ్‌సంగ్ నిలవనుంది. 2026లో 23 కొత్త విండ్‌ఫ్రీ ఏసీల మోడళ్లను కంపెనీ తీసుకొనిరానుంది. బీస్పోక్ ఏఐ సాంకేతికతను వీటికి అమర్చింది. ఇప్పటికే ఇలాంటి సాంకేతికతను రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్‌లు, డ్రైయర్లు లాంటి గృహోపకరణాలకు శామ్‌సంగ్ ఉపయోగించింది. ఏఐ ఎనర్జీ మోడ్, స్మార్ట్ థింగ్స్ హోమ్‌కేర్ ద్వారా వినియోగదార్లు విద్యుత్తును 30% వరకు ఆదా చేసుకోవచ్చని శామ్‌సంగ్ తెలిపింది.

# 'యాక్టివ్' టెక్నాలజీ పెట్రోలు ఆవిష్కరించిన జియోబీపీ

**ఏటా 100 కి.మీ. అదనపు ప్రయాణం**

గోవా: ఇంధన రిటెయిలింగ్ సంస్థ, రిలయన్స్, బీపీల సంయుక్త సంస్థ అయిన జియోబీపీ భారత్‌లో తన విప్లవాత్మక 'యాక్టివ్' టెక్నాలజీ పెట్రోల్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. 'ఇండియా ఎనర్జీ వీక్ 2026' ఇందుకు వేదికైంది. ఈ పెట్రోలు వల్ల కీలక ఇంజిన్ విడిభాగాలు శుభ్రంగా మారి, పనితీరు మెరుగవుతుందని, ఎటువంటి అదనపు వ్యయాలు లేకుండానే వాహనాలు ఏటా 100 కి.మీ. వరకు అధికంగా ప్రయాణించగలవని తెలిపింది. కీలక ఇంజిన్ విడిభాగాల్లో ఉన్న అనవసర పదార్థాలను తొలగించడానికి ఈ ఇంధనాన్ని రూపొందించినట్లు తెలిపింది. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల ఇంధన సామర్థ్యాన్ని పెంచడంతో పాటు నిర్వహణ ఖర్చులనూ ఇది తగ్గిస్తుందని కంపెనీ పేర్కొంది. కోయంబత్తూరులో ఒక మోటార్‌సైకిల్‌లో ఈ పెట్రోల్ నింపి, 4,000 కి.మీ. పైగా నడిపి పరీక్షించగా, ఏటా 100 కి.మీ. వరకు అదనపు ప్రయాణాన్ని ఇది అందించగలదని నిరూపితమైందని జియోబీపీ సీఈఓ అక్షయ్ వాధ్వా పేర్కొన్నారు.

# 10% పెరిగిన బజాజ్ ఆటో లాభం

వాహన సంస్థ బజాజ్ ఆటో, డిసెంబరు త్రైమాసికంలో రూ.2,750 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 202425 ఇదే కాల లాభం రూ.2,196 కోట్లతో పోలిస్తే ఇది 10% ఎక్కువ. అన్ని మార్కెట్లలో విక్రయాలు వృద్ధి చెందడం ఇందుకు కలిసొచ్చింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.13,169 కోట్ల నుంచి రూ.16,204 కోట్లకు పెరిగింది. మొత్తం వాహన విక్రయాలు 12,24,472 నుంచి 10% అధికమై 13,41,252కు చేరాయి. దేశీయ వాహన విక్రయాలు 7,07,105 నుంచి 3% వృద్ధితో 7,31,037కు చేరాయి. ఎగుమతులు 5,17,367 నుంచి 18% పెరిగి 6,10,215గా ఉన్నాయి.

# ఇకామర్స్‌లో ఐటీసీ ప్యాకేజ్డ్ ఫుడ్!

కుకీల నుంచి కేకులు, చట్నీలు, నమ్కీన్లు, సాంబార్ వరకు తన ప్యాకేజ్డ్ ఆహారాన్ని ఇకామర్స్ ద్వారా అందించడానికి ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం ప్రయత్నాలు మొదలుపెట్టింది. తన ఫుడ్‌టెక్ క్లౌడ్ కిచెన్ల ద్వారా తక్కువ కాలం నిల్వ ఉండే పలు ఆహార పదార్థాలను తయారు చేసి, ఇకామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వినియోగదార్లకు విక్రయించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా బెంగళూరులో అమ్మకాలు నిర్వహిస్తోంది. క్రమంగా ఇతర ప్రాంతాలకూ విస్తరించనున్నట్లు కంపెనీ ఈడీ హేమంత్ మాలిక్ తెలిపారు. ఐటీసీ తీసుకొస్తున్న తాజా ఆహార శ్రేణిని బ్లింకిట్, స్విగ్గీ వంటి ఇకామర్స్ ప్లాట్‌ఫారాల ద్వారా విక్రయిస్తున్నట్లు మాలిక్ అన్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణె, ముంబయిలలో 68కి పైగా క్లౌడ్ కిచెన్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# గూగుల్ ఇండియా లాభం రూ.1437 కోట్లు




గూగుల్ ఇండియా 202425 ఆర్థిక సంవత్సరంలో స్టాండలోన్ ఖాతాల ప్రకారం రూ.1436.9 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 202324లోని రూ.1,425 కోట్ల లాభంతో పోలిస్తే స్వల్పంగానే పెరిగింది. ఆదాయం తగ్గడం, ఉద్యోగుల వ్యయాలు, పన్ను మొత్తం పెరగడం ఇందుకు కారణం. ఇదే సమయంలో కార్యకలాపాల ఆదాయం రూ.5,518 కోట్ల నుంచి 3.2% తగ్గి రూ.5,340 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ.5,921 కోట్ల నుంచి 3.2% పెరిగి రూ.6,116 కోట్లకు చేరింది. ఇతరాదాయం రూ.776 కోట్లుగా ఉంది. నికర మార్జిన్ 24.06% నుంచి 23.49 శాతానికి పరిమితమైంది. మొత్తం వ్యయాలు రూ.4,136 కోట్లకు చేరాయి.

## జులైలో 'విశ్వంభర'



మన శంకరవరప్రసాద్‌గారు' విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్నారు కథానాయకుడు చిరంజీవి. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న తదుపరి సినిమా 'విశ్వంభర'పై ప్రేక్షకుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. వశిష్ఠ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. గతేడాదే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సోషియో ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్ వీఎఫ్ఎక్స్ పనుల వల్ల ఆలస్యమైంది. కాగా, ఇప్పడీ పనులన్నీ ఓ కొలిక్కి వస్తుండటంతో జులై తొలివారంలో దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయంపై చిరు కూడా ఇటీవల జరిగిన విలేకర్ల భేటీలో స్పందించారు. ఇది జులై 9న తెరపైకి వచ్చే అవకాశముందని.. దీనికి సంబంధించిన వీఎఫ్ఎక్స్‌ని తానింకా చూడలేదని తెలియజేశారు. మరి ఇది చిరంజీవి చెప్పిన తేదీ నాటికి అన్ని పనుల్ని పూర్తి చేసుకుని తెరపైకి వస్తుందా? లేదా? చూడాలి.

## అదే రోజునే 'వారణాసి'



ఒకవైపు 'పెద్ది' సినిమా చిత్రీకరణలో పాల్గొంటూనే... మరోవైపు కొత్త సినిమా కథకు సంబంధించిన పనులపై దృష్టి పెడుతున్నారు రామ్‌చరణ్. 'పెద్ది' తర్వాత ఆయన సుకుమార్ దర్శకత్వంలో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా కోసం సుకుమార్ ఎప్పట్నుంచో కథని సిద్ధం చేస్తున్నారు. ఆయన తరహా ఓ క్లాస్ కథతోపాటు... అందుకు పూర్తి భిన్నంగా ఒక మాస్ కథనీ సిద్ధం చేసినట్టు సమాచారం. 'రంగస్థలం'లో రామ్‌చరణ్‌ని మాస్ పాత్రలోనే చూపించారు సుకుమార్. మరోసారి అలాంటి విభిన్నమైన పాత్రలోనే రామ్‌చరణ్‌ని చూపించాలని సుకుమార్ భావిస్తున్నట్టు సమాచారం. రామ్‌చరణ్ కూడా మాస్ కథకే పచ్చజెండా ఊపారని సమాచారం. అందులో లుక్ కూడా గత సినిమాలకు భిన్నంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ ఏడాది వేసవిలోనే ఈ సినిమా చిత్రీకరణని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 'పుష్ప' చిత్రాల తర్వాత సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో 'పెద్ది' చిత్రీకరణ సాగుతోంది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఓ సెట్‌లో పాటని చిత్రీకరిస్తున్నారు.

# శ్రీను ఆరాధించే మంగ

'లక్షల సంఖ్యలో దేవతలు నన్ను దాటుకుంటూ వెళ్లిపోతున్నా సరే... నేను మాత్రం నిన్నే చూస్తుంటా' అంటున్నాడు శ్రీను. మంగ అంటే అతనికి అంత ఆరాధన. దేవతల కంటే ఆమే ఎక్కువనేది అతని భావన. ఇంతకీ ఆ మంగ ఎవరు? ఆమె కోసం శ్రీను ఏం చేశాడో తెలియాలంటే 'శ్రీనివాస మంగాపురం' విడుదల వరకూ ఎదురు చూడాల్సిందే. సూపర్‌స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రమే 'శ్రీనివాస మంగాపురం'. అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. 'చందమామ కథలు' పతాకంపై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. సి.అశ్వనీదత్ సమర్పకులు. ఈ చిత్రంతో రవీనా టాండన్ కుమార్తె రషా థడానీ తెలుగు తెరకు పరిచయం అవుతోంది. ఈ సినిమాలో మంగ పాత్రలో సందడి చేయనున్న రషా థడానీ లుక్‌ని శుక్రవారం విడుదల చేసింది చిత్రబృందం. సంప్రదాయ దుస్తుల్లో హుందాగా ఆమె కనిపించింది.

"ఆసక్తికరమైన కథా నేపథ్యం, మంచి సంగీతంతో దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించే చిత్రమిది. సూపర్‌స్టార్ కృష్ణ, రమేశ్‌బాబు, మహేశ్‌బాబు నట వారసత్వాన్ని ఈ చిత్రంతో కొనసాగించనున్నారు జయకృష్ణ ఘట్టమనేని. ఆయన తెరపై కనిపించే విధానం, నటన చాలా బాగుంటుంది. ఆయన, మంగ పాత్రతో తెలుగు తెరకు పరిచయం అవుతున్న రాషా థడానీ జోడీ ప్రేక్షకుల్ని కట్టిపడేస్తుంది. ఉన్నతమైన నిర్మాణ విలువలు, విజన్‌తో ఇప్పటికే 30 రోజులపాటు సాగిన తొలి షెడ్యూల్‌ని పూర్తి చేశాం. ప్రస్తుతం రెండో షెడ్యూల్ చిత్రీకరణ సాగుతోంద"ని సినీ వర్గాలు చెప్పాయి. ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్, ఛాయాగ్రహణం: జయకృష్ణ, కూర్పు: మాధవ్ కుమార్ గుల్లపల్లి, ప్రొడక్షన్ డిజైన్: సాహి సురేశ్, యాక్షన్: రియల్ సతీశ్.



# 'సిరై'.. రూ.3కోట్లతో తీస్తే రూ.30 కోట్లు వసూలు చేసిన క్రైమ్ డ్రామా ఎలా ఉంది?




**తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు పరిచయమున్న నటుడు విక్రమ్ ప్రభు. వైవిధ్యమైన కథలతో అలరించే ఆయన నటించిన 25వ చిత్రం 'సిరై'. తమిళంలో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న ఈ మూవీ ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. మరి ఈ సినిమా ఎలా ఉంది? ఎలాంటి థ్రిల్‌ని పంచింది?**

**కథేంటంటే..**

శ్రీనివాస్ (విక్రమ్ ప్రభు) ఏఆర్ హెడ్ కానిస్టేబుల్. భార్య మేరీ కూడా పోలీస్ కానిస్టేబుల్‌గానే పని చేస్తుంటుంది. ఎస్కార్ట్ డ్యూటీలో ఓ ఖైదీ తప్పించుకునే ప్రయత్నం చేయడంతో తుపాకీతో అతడిని కాలుస్తాడు. దీంతో శ్రీనివాస్‌తో పాటు, అతడితో ఉన్న పోలీసులపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశిస్తారు. అనుకోని పరిస్థితుల్లో అబ్దుల్ రవూఫ్ (అక్షయ్ కుమార్) అనే రిమాండ్ ఖైదీని కోర్టులో హాజరు పరిచే డ్యూటీ చేయాల్సి వస్తుంది. ఈ క్రమంలో అబ్దుల్ కనిపించకుండా పోతాడు. ఉదయాన్నే కోర్టులో హాజరు పరచాల్సిన ఖైదీ పోలీసు తుపాకీతో సహా తప్పించుకుని పారిపోతాడు. ఈ ఘటనతో శ్రీనివాస్, అతడితో ఉన్న కానిస్టేబుళ్లు ఏం చేశారు?అబ్దుల్ వారికి దొరికాడా? అసలు అబ్దుల్ చేసిన నేరం ఏంటి? అన్నది తెలియాలంటే ఈ చిత్రం చూడాల్సిందే.

ఎలా ఉందంటే..?

విక్రమ్ ప్రభు 'తానక్కరన్' చూస్తే, పోలీస్ శిక్షణ ఎలా సాగుతుందో మన కళ్లకు కడుతుంది. వాస్తవానికి దగ్గరగా సాగే ఆ కథ భావోద్వేగభరితంగా ఉంటుంది. అచ్చం అలాంటి కథతోనే మరోసారి వెండితెరపై మ్యాజిక్ చేశారు దర్శకులు సురేశ్ రాజకుమారి, హీరో విక్రమ్ ప్రభు. పోలీసులు ముఖ్యంగా కానిస్టేబుళ్లు, దిగువ ర్యాంకులో ఉన్న వాళ్ల జీవితాలు ఎలా ఉంటాయి? పని చేసే సమయంలో వాళ్లకు ఎదురయ్యే సవాళ్లు ఏంటి? ప్రాణాల మీదకు వచ్చే సమయంలో వాళ్లు తీసుకునే నిర్ణయాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు పడతారు? అన్న అంశాలను ఎంతో రియలిస్టిక్‌గా చూపించారు. రిమాండ్ ఖైదీని బస్సులో తరలించే సన్నివేశం, అతడు తప్పించుకునే క్రమంలో జరిగే యాక్షన్ సీక్వెన్స్‌తో సినిమాను ఆరంభించిన తీరు మెప్పిస్తుంది. ఆత్మరక్షణ కోసం తుపాకీ పేల్చినా ఆ తర్వాత జరిగే పర్యవసానాలు, పోలీసులు ఎదుర్కొనే విచారణలు, కానిస్టేబుళ్లకు దక్కని ఉన్నతాధికారుల మద్దతు ఇలా పోలీసు వ్యవస్థతో అనుబంధం ఉన్నవారికి మాత్రమే తెలిసిన అనేక అంశాలను ఇందులో చూపించిన తీరు బాగుంది.

అబ్దుల్‌ను కోర్టులో హాజరు పరిచేందుకు శ్రీనివాస్ బయలుదేరడంతో కథ కీలక మలుపు తిరుగుతుంది. ఈ క్రమంలో అతడు తప్పించుకునేందుకు చేసే ప్రయత్నాలు, శ్రీనివాస్‌తో ఎస్కార్ట్‌కు వచ్చిన పోలీసుల ప్రవర్తన ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. అబ్దుల్ ఫ్లాష్ బ్యాక్, అతడి లవ్‌స్టోరీ.. అందులో ఉండే అమాయకత్వం, పల్లెటూరి వాతావరణం చూపించిన తీరు హృద్యంగా సాగుతుంది. ఐదేళ్లు రిమాండ్ ఖైదీగా ఉన్న అబ్దుల్ కోసం అతడి ప్రియురాలు వేచి ఉండటం చూస్తే స్వచ్ఛమైన ప్రేమకు దర్శకుడు సరైన అర్థం చెప్పాడనిపిస్తుంది. కొద్ది రోజుల్లో అబ్దుల్ జైలు నుంచి విడుదలవుతాడనగా కోర్టులో జరిగే ఓ సీన్ సినిమాకే హైలైట్. అదే సినిమాను మలుపు తిప్పుతుంది. పతాక సన్నివేశాలు మెప్పిస్తాయి. ఓ విషాదాంత ప్రేమకథను చూస్తాడనుకున్న ప్రేక్షకుడికి ఊహించని ట్విస్ట్ ఇచ్చి, మెప్పించిన తీరు ఆకట్టుకుంటుంది.

ఎవరెలా చేశారంటే..

కానిస్టేబుల్ శ్రీనివాస్ పాత్రలో విక్రమ్ ప్రభు ఒదిగిపోయి నటించారు. ఎలాంటి పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కొనే పోలీసుగా ఆయన నటన మెప్పిస్తుంది. ఒకరికోసం ఒకరు బతికే ప్రేమ జంటగా అక్షయ్, అనిష్మ తమ పాత్రలకు న్యాయం చేశారు. పతాక సన్నివేశాల్లో వారి నటన హైలైట్. సాంకేతికంగా సినిమా బాగుంది. దర్శకుడు సురేశ్ రాజకుమారి సింపుల్ కథను ఎంచుకొని తన స్క్రీన్‌ప్లేతో దానిని ఆవిష్కరించిన తీరు బాగుంది.

కుటుంబంతో చూడొచ్చా: ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడొచ్చు. తెలుగు ఆడియోలో జీ5 వేదికగా అందుబాటులోకి వచ్చింది.

బలాలు

**+ నటీనటులు**

**+ స్క్రీన్‌ప్లే**


**+ క్లైమాక్స్**

**బలహీనతలు**

**- ఫ్లాష్ బ్యాక్‌లో కొన్ని సన్నివేశాలు**

**చివరిగా: 'సిరై' (Sirai) ఎంగేజింగ్ క్రైమ్ డ్రామా.**

**గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!**



# క్లాసూ... మాసూ

ఒకవైపు 'పెద్ది' సినిమా చిత్రీకరణలో పాల్గొంటూనే... మరోవైపు కొత్త సినిమా కథకు సంబంధించిన పనులపై దృష్టి పెడుతున్నారు రామ్‌చరణ్. 'పెద్ది' తర్వాత ఆయన సుకుమార్ దర్శకత్వంలో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా కోసం సుకుమార్ ఎప్పట్నుంచో కథని సిద్ధం చేస్తున్నారు. ఆయన తరహా ఓ క్లాస్ కథతోపాటు... అందుకు పూర్తి భిన్నంగా ఒక మాస్ కథనీ సిద్ధం చేసినట్టు సమాచారం. 'రంగస్థలం'లో రామ్‌చరణ్‌ని మాస్ పాత్రలోనే చూపించారు సుకుమార్. మరోసారి అలాంటి విభిన్నమైన పాత్రలోనే రామ్‌చరణ్‌ని చూపించాలని సుకుమార్ భావిస్తున్నట్టు సమాచారం. రామ్‌చరణ్ కూడా మాస్ కథకే పచ్చజెండా ఊపారని సమాచారం. అందులో లుక్ కూడా గత సినిమాలకు భిన్నంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ ఏడాది వేసవిలోనే ఈ సినిమా చిత్రీకరణని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 'పుష్ప' చిత్రాల తర్వాత సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో 'పెద్ది' చిత్రీకరణ సాగుతోంది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఓ సెట్‌లో పాటని చిత్రీకరిస్తున్నారు.

# ఇది మన కథే అనిపిస్తోంది: రానా దగ్గుబాటి

**మహేశ్ రాజ్, అనస్వరా రాజన్, రానా, సౌందర్య, అభిషన్ జీవింత్**

"'విత్ లవ్' మూవీ ట్రైలర్ బాగుంది. ఇది మన కథే అనిపిస్తోంది. ట్రైలర్ చూసిన వారందరూ చాలా కనెక్ట్ అయ్యారు. అందరూ కనెక్ట్ అయ్యే ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ ఇది. సౌందర్యగారు తెలుగులో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. యూనిట్‌కి ఆల్ ది బెస్ట్" అని హీరో రానా దగ్గుబాటి చెప్పారు. అభిషన్ జీవింత్, అనస్వరా రాజన్ ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'విత్ లవ్'. మదన్ రచన, దర్శకత్వం వహించారు.ఈ చిత్రాన్ని సౌందర్య రజనీకాంత్‌తో కలిసి ఎంఆర్‌పీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నజరత్ పసిలియన్, మహేశ్ రాజ్ పసిలియన్ సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఫిబ్రవరి 6న విడుదల కానుంది. తెలుగులో సురేశ్‌ప్రొడక్షన్స్ సంస్థ విడుదల చేస్తోంది. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సౌందర్య రజనీకాంత్ మాట్లాడుతూ- "నా చిన్నప్పటి ఫ్రెండ్ రానా. తనతో నాకు ఎన్నో బాల్య జ్ఞాపకాలున్నాయి. 'విత్ లవ్'ని తను రిలీజ్ చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాని అందరూ థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు. "మా 'టూరిస్ట్ ఫ్యామిలీ'కి మీరందరూ గొప్ప ఆదరణ ఇచ్చారు. 'విత్ లవ్' కూడా అద్భుతమైన భావోద్వేగాలున్న సినిమా. మన జ్ఞాపకాలని నెమరువేసుకునేలా ఉంటుంది" అన్నారు అభిషన్ జీవింత్. "'విత్ లవ్' క్యూట్ సినిమా. చాలా ప్రేమతో ఈ చిత్రం చేశాం. తప్పకుండా అందర్నీ అలరిస్తుంది" అని పేర్కొన్నారు అనస్వరా రాజన్. మహేశ్ రాజ్ మాట్లాడుతూ- "'టూరిస్ట్ ఫ్యామిలీ'లానే ఈ సినిమాని కూడా ఆదరించాలని కోరుకుంటున్నాను" అన్నారు.



# డబ్ల్యూపీఎల్‌కు 'బెల్' పచ్చతోరణం!

**–డాట్ బాల్స్‌తో లారెన్ విజృంభణ**
**–అదరగొడుతున్న ఇంగ్లిష్ బౌలర్**




ఈ ఏడాది మహిళల ప్రిమియర్ లీగ్ (WPL) ఆరంభానికి ముందు భారత క్రికెట్ అభిమానులకు లారెన్ బెల్ (Lauren Bell) గురించి పెద్దగా పరిచయం లేదు. కానీ, లీగ్ ఆరంభమై పది రోజులు తిరిగేసరికి ఈ ఇంగ్లిష్ ఫాస్ట్ బౌలర్ ఇండియన్ ఫ్యాన్స్ ఫేవరెట్ అయిపోయింది! తన ఆట, అందం మన అభిమానులను అమితంగా ఆకట్టుకోవడంతో సోషల్ మీడియాలో తన ఫాలోయింగ్ అమాంతం పెరిగిపోయింది. ఇటు వికెట్ల మీద వికెట్లు తీస్తూ.. అటు డాట్ బాల్స్‌తో బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఈ సీజన్‌లో టాక్ ఆఫ్ ద డబ్ల్యూపీఎల్‌గా మారింది లారెన్. ఐపీఎల్‌లో (IPL) బౌలర్ డాట్ బాల్ వేసిన ప్రతిసారీ ఒక మొక్కను నాటే సంప్రదాయం చాలా ఏళ్ల నుంచి కొనసాగుతున్న సంగతి తెలిసిందే. డబ్ల్యూపీఎల్‌లో ఆరంభం నుంచే ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటిదాకా 8 మ్యాచ్‌లు ఆడిన లారెన్, మొత్తంగా 192 బంతులు వేస్తే.. అందులో 116 డాట్ బాల్స్ ఉండడం విశేషం. ఒక టీ20 లీగ్‌లో ఒక బౌలర్ వేసిన మొత్తం బంతుల్లో 60 శాతం డాట్ బాల్స్ అంటే అసామాన్యమైన విషయం. ఈ సీజన్ మొత్తంలో 4 మెయిడెన్లు నమోదైతే.. రెండు బెల్ పేరిటే ఉండడం విశేషం. అందుకే ఆమె డబ్ల్యూపీఎల్‌కు పచ్చతోరణం కడుతోందని.. లీగ్ అయ్యేలోపు తన పేరిట నాటే మొక్కలతో ఒక అడవినే సిద్ధం చేసేలా ఉందని సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యానాలు చేస్తున్నారు నెటిజన్లు. ఆర్సీబీ ఈ సీజన్‌లో 8 మ్యాచ్‌ల్లో 6 విజయాలు సాధించి అగ్రస్థానంతో నేరుగా ఫైనల్ చేరడంలో లారెన్ బెల్‌ది అత్యంత కీలక పాత్ర. ఈ సీజన్లో బెల్ ఎకానమీ 5.62 మాత్రమే కావడం విశేషం. అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో బెల్‌ది నాలుగో స్థానం. ఆమె 8 మ్యాచ్‌ల్లో 12 వికెట్లు తీసింది. **--ఇలా వచ్చిందో లేదో....** అంతర్జాతీయ క్రికెట్‌లో కొన్నేళ్లుగా మేటి ఫాస్ట్ బౌలర్లలో ఒకరిగా కొనసాగుతోంది లారెన్ బెల్. 31 వన్డేలాడి 44 వికెట్లు తీసిన ఆమె.. 36 టీ20ల్లో 50 వికెట్లు పడగొట్టింది. బెల్ 5 టెస్టులు కూడా ఆడింది. అయితే డబ్ల్యూపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడింది మాత్రం ఈ సీజన్‌లోనే. ఈ సారి వేలంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (WPL Royal Challengers Bengaluru) జట్టు రూ.90 లక్షలతో ఆమెను కొనుగోలు చేసింది. ఆ ధరను మించిన ఆటతో దూసుకెళ్తోంది లారెన్. ఆటతో పాటు తన లుక్స్‌తోనూ ఆమె సోషల్ మీడియా దృష్టిని ఆకర్షిస్తోంది. లారెన్‌కు ఈ డబ్ల్యూపీఎల్ ఆరంభానికి ముందు సోషల్ మీడియాలో పెద్దగా ఫాలోయింగ్ లేదు. తన ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ల సంఖ్య 2 లక్షల లోపే ఉండేది. కానీ ప్రస్తుతం ఆ సంఖ్య 1.9 మిలియన్లను దాటిపోయింది! **--యూపీ జట్టులో బెంచ్‌కు పరిమితం.....** 2023లో డబ్ల్యూపీఎల్ తొలి సీజన్‌లోనే లారెన్‌ను యూపీ వారియర్స్ (WPL UP Warriorz) రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. కానీ ఆ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడించలేదు. తర్వాతి సీజన్‌కు లారెన్ ధర రూ.10 లక్షలకు పడిపోయింది. అప్పుడు కూడా యూపీనే తనను సొంతం చేసుకుంది. కానీ ఆ సీజన్ కూడా ఒక్క మ్యాచ్‌లోనూ బరిలోకి దించలేదు. తర్వాతి సీజన్‌కు ఆమెను విడుదల చేసింది. 2025లో లారెన్‌ను ఏ జట్టూ కొనుగోలు చేయలేదు. కానీ అంతర్జాతీయ క్రికెట్‌లో లారెన్ మెరుపులు చూశాక ఈ సీజన్‌కు ముందు వేలంలో ఆమె కోసం ఫ్రాంచైజీల మధ్య గట్టి పోటీ నెలకొంది. చివరికి ఆర్సీబీ ఆమె కోసం రూ.90 లక్షలు పెట్టింది. అప్పుడు ఆ రేటు ఎక్కువేమో అన్న అభిప్రాయాలు కలిగాయి. కానీ ఇప్పుడు తన ఆటతో, ఆకర్షణతో ఆర్సీబీకి చేకూరుస్తున్న విలువ చూశాక తనకు దక్కిన ధర చాలా తక్కువ అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి

# అది బంగ్లాదేశ్ స్వయంకృతాపరాధం ..సురేశ్ రైనా



టీ20 వరల్డ్ కప్ 2026 ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక వేదికగా ప్రారంభం కానుంది. అయితే భద్రత కారణాలను సాకుగా చూపుతూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ (BCB) తమ క్రీడాకారులను భారత్‌కు పంపడానికి ఒప్పుకోలేదు. తమ మ్యాచ్ వేదికలను శ్రీలంకకు మార్చమని ఐసీసీ (ICC)పై ఒత్తిడి తెచ్చిన విషయం తెలిసిందే. అయితే బంగ్లాదేశ్ చెప్పినట్లు భారత్‌లో భద్రత సమస్యలు లేనందున ఐసీసీ దీనికి అంగీకరించలేదు. దీంతో బంగ్లాదేశ్ మెగా టోర్నీ నుంచి తప్పుకొంది. ర్యాంకుల ఆధారంగా బంగ్లా స్థానంలో స్కాట్లాండ్‌ను ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ కోసం ఎంపిక చేసింది. బంగ్లాకు మద్దతుగా పాకిస్థాన్ కూడా వరల్డ్‌కప్‌ను బహిష్కరిస్తుందని వార్తలు వచ్చాయి. కానీ తర్వాత పాక్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. టీ20 ప్రపంచకప్ కోసం ఆ జట్టు శ్రీలంకకు వెళ్లబోతోంది. ఈ మేరకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (PCB) షెడ్యూల్ కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. ఫిబ్రవరి 2న పాక్ కొలంబోకు చేరనున్నట్లు తెలిసింది. ఈ మేరకు పీసీబీ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ పరిణామాలపై టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సురేశ్ రైనా వరల్డ్ లెజెండ్స్ ప్రో టీ20 లీగ్ సందర్భంగా మాట్లాడాడు. 'ప్రస్తుతం ఏదైతే జరిగిందో అదంతా బంగ్లాదేశ్ స్వయంకృతాపరాధం. భారత్‌లో భద్రతపరమైన సమస్యలు లేవు. నా ఉద్దేశంలో ఇదంతా బంగ్లాదేశ్ తప్పు. ఆ దేశ క్రికెట్ జట్టు భారత్‌కు రాకపోవడం వల్ల చాలా కోల్పోనుంది. నిజానికి ఆ టీమ్ చాలా స్ట్రాంగ్‌గా కనిపిస్తోంది. ఆ జట్టు స్పిన్నర్లకు భారత్ పిచ్‌ల గురించి బాగా తెలుసు' అని సురేశ్ రైనా అన్నాడు. అలాగే టీ20 వరల్డ్ కప్ 2026 నేపథ్యంలో ఐసీసీ ఛైర్మన్ జైషా వ్యాఖ్యల గురించి కూడా సురేశ్ రైనా మాట్లాడాడు. 'టీ20 వరల్డ్ కప్ ఆడేందుకు ఎవరైతే భారత్‌కు రారో.. వారి మీద కఠినమైన చర్యలు తీసుకుంటామని ఐసీసీ ఛైర్మన్ అన్నారు. అలాగే ఆ దేశ క్రికెట్ బోర్డులు సైతం భారీగా నష్టపోయే అవకాశమూ ఉంది' అని సురేశ్ రైనా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

## ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నకిరేకల్, మీ స్పందన : హైదరాబాద్ యశోద ఆసుపత్రి సహకారంతో నకిరేకల్‌లోని ఏవీఎం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శుక్రవారం ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే సేవా కార్యక్రమాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ మదన్‌మోహన్, డాక్టర్ వై.మోహన్ రెడ్డి, పాపిరెడ్డి, రామ్మోహన్ రావు, సతీష్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## పి.టి.ఉష భర్త శ్రీనివాసన్ మృతి



భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు, దిగ్గజ అథ్లెట్ పి.టి. ఉష భర్త వి.శ్రీనివాసన్ (67) మృతి చెందారు. శుక్రవారం తెల్లవారుజామున తన నివాసంలో శ్రీనివాసన్ కుప్పకూలినట్లు కుటుంబ వర్గాలు తెలిపాయి. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లినా ఆయనను కాపాడుకోలేకపోయారు. ఉషతో మాట్లాడిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. ఆమె భర్త మృతి పట్ల సంతాపం తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ మాజీ ఉద్యోగి శ్రీనివాసన్.. ఉష క్రీడా, రాజకీయ జీవితంలో ఆమె వెన్నంటి నిలిచారు. వీరిద్దరికి ఒక కుమారుడు ఉన్నాడు.

## ఇక మీ గూగ్లీకి గూగుల్ సాయం: సుందర్ పిచాయ్




క్రికెట్ మ్యాచ్‌ల్లో అత్యుత్తమ అనుభూతి కోసం ఐసీసీ (International Cricket Council)తో గూగుల్ జట్టు కట్టింది. ఈ ఒప్పందంతో క్రికెట్‌ను మరింత లోతుగా విశ్లేషించేందుకు వీలుకానుంది. ప్రత్యక్ష మ్యాచ్‌ల వీడియో, ఆడియో వ్యాఖ్యానాన్ని అడ్వాన్స్‌డ్ ఏఐ జెమిని 3 ప్రో విశ్లేషించనుంది. దీంతో అభిమానులు మ్యాచ్‌లను మరింతగా ఆస్వాదించేందుకు వీలుపడనుంది. ఈ మేరకు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ''ఇప్పుడు గూగుల్ (Google).. మీ గూగ్లీకి సహాయం చేస్తుంది'' అని పేర్కొన్నారు. ఏఐ జెమిని 3 ప్రో లైవ్ మ్యాచ్‌ను గమనించి, కామెంటరీని విని, ఏం జరిగిందనేది సరళమైన భాషలో ఫ్యాన్స్‌కు వివరిస్తుంది. మ్యాచ్ హైలైట్స్, ఆటగాళ్లు, ఆటకు సంబంధించి ఇతర ఆసక్తికర విషయాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచనుంది. ఈ అధునాతన సాంకేతికతను వాడి, మహిళల క్రికెట్‌ను మరింతగా అభిమానులకు చేరువ చేయడం కూడా ఈ భాగస్వామ్యం ఉద్దేశం.

# వామ్మో.. క్రికెట్‌లో ఇన్ని రకాల డకౌట్‌లున్నాయా?




విశాఖపట్నం వేదికగా బుధవారం టీమ్ఇండియా (Team India), న్యూజిలాండ్ మధ్య నాలుగో టీ20 జరిగిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు 50 పరుగుల తేడాతో విజయం సాధించింది. టీమ్ఇండియా బ్యాటర్ అభిషేక్ శర్మ (Abhishek Sharma) తాను ఎదుర్కొన్న తొలి బంతికే సున్నా పరుగులతో వెనుదిరిగాడు. దీన్ని గోల్డెన్ డక్ అని అంటారని తెలుసు కదా.. మరి క్రికెట్‌లో ఇలాంటి మరికొన్ని డకౌట్లున్నాయి తెలుసా?

**డైమండ్ డక్:** బ్యాటర్లు చాలా అరుదుగా డైమండ్ డకౌట్ అవుతుంటారు. ఇలా జరగాలంటే.. ఒక్క బంతి కూడా ఎదుర్కోకుండానే వారు పెవిలియన్ చేరాల్సి ఉంటుంది. ఇలా జరగడానికి రెండే ఛాన్స్‌లున్నాయి. ఒకటి రనౌట్, రెండోది టైమ్డ్ ఔట్. 2023 వరల్డ్ కప్‌లో శ్రీలంక బ్యాటర్ ఏంజెలో మాథ్యూస్ బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో టైమ్డ్ అవుట్‌గా వెనుదిరిగాడు. అప్పట్లో ఈ డిస్మిసల్ చర్చనీయాంశంగా మారింది. ఇది డైమండ్ డక్ కిందకే వస్తుంది. **గోల్డెన్ డక్:** బ్యాటర్ తాను ఎదుర్కొన్న మొదటి బంతికే ఔటైతే.. దాన్ని గోల్డెన్ డక్ అంటారు. ప్రస్తుత న్యూజిలాండ్ సిరీస్‌లో అభిషేక్ శర్మ ఇలాగే రెండుసార్లు గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు.

**సిల్వర్ డక్:** బ్యాటర్ రెండో బంతికి సున్నా పరుగుల మీద ఔటైతే దాన్ని సిల్వర్ డక్‌గా వ్యవహరిస్తుంటారు. **బ్రాంజ్ డక్:** బ్యాటర్ పరుగుల ఖాతా తెరవకుండా మూడో బంతికి ఔటైతే దాన్ని బ్రాంజ్ డక్ అంటారు. **రాయల్ డక్:** దీనికే ప్లాటినమ్ డక్ అనే పేరు కూడా ఉంది. ఇది కేవలం ఓపెనర్లకే వర్తిస్తుంది. ఓపెనర్ తాను ఎదుర్కొన్న మొదటి బంతికే పెవిలియన్‌కు చేరితే దాన్ని రాయల్ డక్ అంటారు. విశాఖపట్నంలో అభిషేక్ ఔట్‌ను రాయల్ డక్ అని కూడా అనొచ్చు. **లాఫింగ్ డక్:** ఒక జట్టు ఇన్నింగ్స్‌లో చివరి బంతికి బ్యాటర్ డకౌట్ అయితే దాన్ని లాఫింగ్ డక్ అని పిలుస్తారు. **పెయిర్:** ఇది కేవలం టెస్ట్ మ్యాచుల్లోనే సాధ్యమవుతుంది. ఒక బ్యాటర్ తాను ఎదుర్కొన్న బంతుల్లో సంబంధం లేకుండా.. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ డకౌట్ అయితే దాన్ని పెయిర్ అని అంటారు. **కింగ్ పెయిర్:** టెస్ట్ మ్యాచ్‌లో బ్యాటర్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ తాను ఎదుర్కొన్న మొదటి బంతికి పెవిలియన్‌కు చేరితే దాన్ని కింగ్ పెయిర్ అని వ్యవహరిస్తారు. **టైటానియమ్ డక్:** ఇది కూడా కాస్త డైమండ్ డక్‌లానే ఉంటుంది. కానీ ఇందులో చిన్న తేడా ఉంది. జట్టు ఇన్నింగ్స్ ప్రారంభమైనప్పుడు బ్యాటర్ ఒక్క బంతి కూడా ఎదుర్కోకుండా ఒక్క పరుగు సైతం చేయకుండా ఔటైతే దాన్ని టైటానియమ్ డక్ అంటారు. **గోల్డెన్ గూస్:** గోల్డెన్ గూస్ డక్ అనేది సీజన్ ఆధారంగా ఉంటుంది. ఒక బ్యాటర్ కొత్త సీజన్‌లో మొదటి మ్యాచ్‌లో తొలి బంతికి సున్నా పరుగులతో వెనుదిరిగితే దాన్ని గోల్డెన్ గూస్ డకౌట్‌గా వ్యవహరిస్తారు. మొత్తానికి ఇవీ క్రికెట్‌లోని ప్రముఖమైన డకౌట్లు.

# మెరుపులతో ముగిస్తారా?

**కివీస్‌తో చివరి టీ20 నేడు**
**ప్రపంచకప్ ముంగిట ఇదే ఆఖరి పోరు**
**రాత్రి 7 నుంచి**



సిరీస్ ఇప్పటికే సొంతమైనా సరే.. ఇది నామమాత్రమైన పోరే అయినా.. ఎంతో కీలకమే! ఇంకో వారంలో సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్ మొదలు కాబోతుండగా.. చివరగా ఆడే మ్యాచ్‌లో ఘనవిజయం సాధించి మెగా టోర్నీలో అడుగు పెట్టడం టీమ్ఇండియాకు ఎంతో అవసరం. జట్టు గత మ్యాచ్ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని సిరీస్‌కు మెరుపు ముగింపునివ్వాలని అభిమానులు ఆశిస్తున్నారు. హ్యాట్రిక్ విజయాలతో జోరుమీదున్న టీమ్ఇండియాకు నాలుగో టీ20లో గట్టి షాకే ఇచ్చింది కివీస్. ఆ మ్యాచ్‌లో ఏకంగా 50 పరుగుల తేడాతో ఓడిన నేపథ్యంలో శనివారం చివరి మ్యాచ్‌లో భారత్ ఎలా ఆడుతుందన్నది ఆసక్తికరం. ఇంకో ఓటమి ఎదురైతే ప్రపంచకప్ ముంగిట జట్టు ఆత్మవిశ్వాసానికి గట్టి దెబ్బే అవుతుంది. కాబట్టి సూర్యకుమార్ సేన ఈ మ్యాచ్‌లో గెలిచి తీరాల్సిందే.

**ఉత్సాహంగా కివీస్:** నాలుగో టీ20లో ఇటు బ్యాటుతో, అటు బంతితో చక్కటి ప్రదర్శనతో భారత్‌పై ఘనవిజయం సాధించిన కివీస్.. మరోసారి అలాంటి ప్రదర్శనే చేసి సిరీస్‌ను గౌరవప్రదంగా ముగించాలని చూస్తోంది. గత మ్యాచ్‌లో కివీస్ బ్యాటర్లు.. భారత బౌలర్లపై ఎదురుదాడి చేసి ఫలితం రాబట్టారు. వచ్చిన బ్యాటర్ వచ్చినట్లే బాదుతూ పోవడంతో భారత్ ముందు 216 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. ఓపెనర్లు సీఫర్ట్, కాన్వేలతో పాటు మిచెల్, ఫిలిప్స్ మంచి ఊపుమీదున్నారు. భారత బౌలర్లు ఈ నలుగురినీ కట్టడి చేయడం మీదే జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. గత మ్యాచ్‌లో బుమ్రా సహా బౌలర్లందరూ ధారాళంగా పరుగులిచ్చేశారు. మరి శనివారం బౌలర్ల ప్రదర్శన ఎలా సాగుతుందో చూడాలి. కివీస్ బౌలర్లలో హెన్రీ, శాంట్నర్‌ల నుంచి భారత బ్యాటర్లకు ముప్పు పొంచి ఉంది.

**సొంతగడ్డపై అయినా..:** ఈ సిరీస్ ఆరంభం నుంచి భారత్‌కు అతి పెద్ద ఆందోళనగా మారింది సంజు శాంసన్ ఫామే. ఈ మ్యాచ్‌లో అయినా అతడు పుంజుకుంటాడేమో అని అభిమానులు ఎదురు చూస్తున్నారు కానీ.. అతను ఎంతకీ జోరందుకోవట్లేదు. గత మ్యాచ్‌లో ఇన్నింగ్స్‌ను బాగానే ఆరంభించినా పెద్ద స్కోరు చేయలేకపోయాడు. చివరి టీ20 జరగబోతోంది తన సొంత నగరమైన తిరువనంతపురంలో కావడంతో ఓ పెద్ద ఇన్నింగ్స్ ఆడడానికి ఇంతకంటే మంచి వేదిక మరొకటి ఉండదు. ఒక మ్యాచ్‌లో మెరుపులు మెరిపించి మరో మ్యాచ్‌లో విఫలమవుతున్న మరో ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా నిలకడ అందుకోవాల్సి ఉంది. విశాఖలో సంచలన ఇన్నింగ్స్ ఆడిన శివమ్ దూబెపై ఈ మ్యాచ్‌లో అందరి కళ్లూ నిలిచి ఉన్నాయి. రింకు కూడా మంచి ఊపులోనే ఉన్నాడు. ఆ మ్యాచ్‌లో తుది జట్టుకు దూరమైన ఇషాన్ కిషన్.. చివరి టీ20లో ఆడే అవకాశముంది. తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ మైదానంలో పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. స్పిన్నర్లకూ అవకాశముంటుంది. టాస్ గెలిచిన జట్టు బౌలింగే ఎంచుకోవచ్చు. ఇక్కడ భారత్ 4 టీ20లు ఆడి మూడు నెగ్గింది. ఒక మ్యాచ్ ఓడింది

# గుజరాత్.. రైట్ రైట్



డబ్ల్యూపీఎల్ 4లో గుజరాత్ జెయింట్స్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఈ సీజన్లో తన చివరి మ్యాచ్‌ను ముంబయి ఇండియన్స్‌తో ఆడిన ఆ జట్టు.. 11 పరుగుల తేడాతో నెగ్గి మంగళవారం జరిగే ఎలిమినేటర్‌కు అర్హత సాధించింది. 8 మ్యాచ్‌ల్లో 5 విజయాలతో ఆ జట్టు 10 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ముంబయికి కూడా ఇదే చివరి మ్యాచ్. ఆ జట్టు 6 పాయింట్లకు పరిమితమైంది. ఎలిమినేటర్‌లో రెండో బెర్తు కోసం ముంబయితో పాటు దిల్లీ (6), యూపీ (4) మధ్య పోటీ నెలకొంది. ఆదివారం దిల్లీ, యూపీ తలపడతాయి. డీసీ గెలిస్తే ఆ జట్టే రెండో ఎలిమినేటర్‌కు అర్హత సాధిస్తుంది. ముంబయి, యూపీ నిష్క్రమిస్తాయి. యూపీ గెలిస్తే మూడు జట్ల పాయింట్లు సమమవుతాయి. నెట్‌రన్‌రేట్‌లో ముందున్న జట్టు ముందంజ వేస్తుంది. ప్రస్తుతానికి ముంబయే నెట్‌రన్‌రేట్‌లో మెరుగ్గా ఉంది. యూపీ భారీ విజయం సాధిస్తే తప్ప.. ముంబయే ఎలిమినేటర్‌కు అర్హత సాధించవచ్చు. శుక్రవారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో మొదట గుజరాత్ 4 వికెట్లకు 167 పరుగులు సాధించింది. ఆష్లీ గార్డ్‌నర్ (46; 28 బంతుల్లో 7×4, 1×6), జార్జియా వేర్‌హామ్ (44 నాటౌట్; 26 బంతుల్లో 4×4, 2×6) మెరుపు ఇన్నింగ్స్‌లతో జట్టుకు మెరుగైన స్కోరునందించారు. అనుష్క శర్మ (33; 31 బంతుల్లో 4×4, 1×6), సోఫీ డివైన్ (25; 21 బంతుల్లో 3×4) కూడా ఉపయుక్తమైన ఇన్నింగ్స్‌లు ఆడారు. ముంబయి బౌలర్లలో అమేలియా కెర్ (2/26), షబ్నిమ్ ఇస్మాయిల్ (1/29) సత్తా చాటారు. ఛేదనలో ముంబయి తడబడింది. ఈ సీజన్లో సూపర్ ఫామ్‌లో ఉన్న సోఫీ డివైన్ (41232) మరోసారి గొప్పగా బౌలింగ్ చేసి ముంబయికి బ్రేకులేసింది. ఆమెతో పాటు జార్జియా వేర్‌హామ్ (2/26) కూడా రాణించడంతో 13 ఓవర్లకు 86/4తో ముంబయి ఓటమి బాటలో సాగింది. అయితే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (82 నాటౌట్; 48 బంతుల్లో 8×4, 4×6) అద్భుత పోరాటంతో జట్టులో ఆశలు రేపింది. కానీ సాధించాల్సిన రన్‌రేట్ బాగా పెరిగిపోవడంతో ఆమె ప్రయత్నం ఫలించలేదు. చివరి ఓవర్లో 26 పరుగులు అవసరం కాగా.. 1, 3 బంతులకు సిక్సర్లు బాదినప్పటికీ.. చివరి 3 బంతుల్లో 2 పరుగులే రావడంతో ముంబయికి ఓటమి తప్పలేదు.

**గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్:** బెత్ మూనీ (సి) సజన (బి) షబ్నిమ్ 5; సోఫీ డివైన్ (సి) అమేలియా (బి) నాట్ సీవర్ 25; అనుష్క (సి) షబ్నిమ్ (బి) అమేలియా 33; ఆష్లీ గార్డ్‌నర్ (స్టంప్డ్) రహిల (బి) అమేలియా 46; జార్జియా వేర్‌హామ్ నాటౌట్ 44; భార్తీ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (20 ఓవర్లలో 4 వికెట్లకు) 167 వికెట్ల పతనం: 1121, 269, 371, 4142 బౌలింగ్: షబ్నిమ్ ఇస్మాయిల్ 40291; నాట్ సీవర్ 40361; వైష్ణవి 20210; అమన్‌జ్యోత్ 20130; అమేలియా కెర్ 40262; హేలీ మాథ్యూస్ 40400